ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 4 ఏప్రిల్ 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 25.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:26 (గురు)
సహరి : 4:34 (శుక్ర)

పింఛన్.. పడిగాపులు!


గూటాల సచివాలయం వద్ద పింఛన్‌దారుల ఎదురుచూపు


ముదినేపల్లి మండలం పెయ్యేరు సచివాలయం వద్ద నీరసించి ఇలా..


ఏలూరు గన్‌బజార్ సచివాలయం వద్ద వృద్ధుడి పాట్లు

ఎన్నడూ వెళ్ళని సచివాలయాలకు పడుతూ, లేస్తూ పేద జనం బుధవారం ఉదయాన్నే చేరుకున్నారు. ఈ రోజు అయినా పింఛన్ ఇస్తారో, ఇవ్వరోనని సందేహాల నడుమ గంటల తరబడి తీవ్ర ఉక్కపోత, వేడిగాలుల మధ్య వందలాది మంది నిరీక్షించారు. ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తే.. బ్యాంకుల నుంచి డబ్బు రాలేదు. అందాక ఇస్తామంటూ మధ్యాహ్నం వరకు గడిపేశారు. పింఛన్ సొమ్ముకు సరిపడా బ్యాంకుల నుంచి సొమ్ము కొన్ని సచివాలయాలకే చేరింది. ఇంకొన్ని వాటికి సాయంత్రం వరకు అందలేదు. ఇంతాచేస్తే పింఛన్ అందింది కొంత మందికే. నేడు, రేపు బ్యాంకుల నుంచి ఎంత డబ్బు అందుతుందో మరెంత మందికి ఇస్తారో చూడాల్సిందే.

\- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఉక్కపోతలో నిరీక్షణ

- సచివాలయాల ఎదుట గంటల తరబడి కూలబడిన వృద్ధులు
- బ్యాంకుల నుంచి సొమ్ములు రాక పింఛన్ అందక విలవిల
- పంపిణీలో ఆదినుంచి సమన్వయలోపం
- తొలిరోజు అందించింది రూ.32 కోట్లకు పైబడి..
- ఈలోపే సచివాలయాల్లో వైసీపీ యాక్షన్, డైరెక్షన్
- టీడీపీపై నిందలు వేసేలా పింఛన్‌దారులపై ఒత్తిడి

పడుతూ.. లేస్తూ

పింఛన్ సొమ్ములు కోసం బీదా, బిక్కి జనం, వయోవృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఇలా ఒకరేంటి అందరూ సచివాలయానికి చేరుకున్నారు. పింఛన్ కోసం పడిగాపులు పడ్డారు. మండుటెండలో ముప్పుతిప్పలకు గురయ్యారు. వాస్తవానికి పింఛన్ సొమ్ముపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతుండగా అధికారులు హడావుడి చేసి బుధవారం నుంచే పింఛన్ పంపిణీ చేస్తామంటూ ప్రకటనలు గుప్పించారు. యథావిధిగానే ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పంపిణీ సాగుతుందన్నారు. ఇంకేముంది జనం కాస్త ఉదయం ఎనిమిది గంటలకే ఆయా సచివాయాల ఎదుట వాలిపోయారు. తీరా చూస్తే సచివాలయాల తలుపులు చాలాచోట్ల తెరుచుకోలేదు. సచివాలయ సిబ్బంది పది గంటల వరకు జాడ లేకుండా పోయారు. మరికొన్నిచోట్ల పింఛన్ దారులకు జవాబు చెప్పేనాథుడే కరువయ్యాడు. వేసవి తాపంతో వృద్ధులు విలవిల్లాడారు. చాలాచోట్ల సచివాలయాల ఎదుట టెంట్లు వేసి కుర్చీలు వేశారు. ఇంకొన్నిచోట్ల మంచినీటి అవసరాన్ని మరవడంతో పింఛన్ తీసుకోవడానికి వచ్చిన వారంతా ఇబ్బందులు పడ్డారు. ఇప్పటి వరకు పింఛన్ సొమ్ములను ఇళ్లకు వచ్చి వలంటీర్లు అందిస్తూ వచ్చారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ముందు జాగ్రత్తలు చేయాల్సిన యంత్రాంగం చేయలేకపోయింది. ఓ వైపు ఎండలు హోరెత్తిస్తుండగా తొలిరోజు గంటల తరబడి సచివాలయం ఎదుటే జనం సాగిలపడ్డారు. బ్యాంకుల నుంచి డబ్బు తీసుకురావడానికి వెళ్ళిన సిబ్బంది చాలా చోట్ల మధ్యాహ్నం వరకు చేరుకోలేకపోయారు. అలాంటిచోట్ల పింఛన్‌దారులు పడినపాట్లు అన్ని ఇన్నీ కావు. మంచంపట్టిన వ్యాధిగ్రస్థులకు, కదల్లేని వారికి ఇళ్ళవద్దే పింఛన్ అందించాలని విపక్షాలు కోరినట్లుగానే అధికార యంత్రాంగం అలాగే చేస్తామని బదులిచ్చింది. తొలిరోజు ఎక్కడా ఆ పరిస్థితి కనిపించలేదు. సచివాలయాలకు వచ్చిన వారికి మాత్రమే పింఛన్లు అందించారు. కొన్నిచోట్ల మధ్యాహ్నం 12 గంటలకు పింఛన్ పంపిణీ ప్రారంభం అయింది. ఇంకొన్నిచోట్ల సాయంత్రం ఐదు దాటినా ఆరంభమే కాలేదు. జిల్లావ్యాప్తంగా 605 సచివాలయాలు ఉండగా, వీటి పరిధిలో 2 లక్షల 75 వేల మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరిలో మధ్యాహ్నం ఆరంభించిన పంపిణీ కాస్త రాత్రి పొద్దుపోయే నాటికి 48 శాతం మేర పూర్తైనట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. లక్షా 30 వేల మందికి పైగా పింఛన్‌దారులకు రూ.40 కోట్లు మేర పింఛన్ సొమ్ము పంపిణీ చేసినట్టు ప్రకటించారు. తొలిరోజు ఈ మొత్తాన్ని అందించడానికే సచివాలయ సిబ్బంది ఆపసోపాలు పడ్డారు. ప్రత్యేకించి కొన్ని గ్రామ సచివాలయాల్లో పింఛన్ సొమ్ము అందక పంపిణీ ఆరంభించలేకపోయింది. కైకలూరు నియోజకవర్గం కలిదిండి మండలంలో తొలిరోజు పింఛన్ పంపిణీ చేయలేకపోయారు. బ్యాంకుల నుంచి సరిపడా సొమ్ము అందకే ఈ పరిస్థితి తలెత్తినట్టు అధికార వర్గాలు నిర్ధారించాయి. ఇంకొన్నిచోట్ల సచివాలయాలకు వచ్చిన పింఛన్‌దారులకు మాత్రమే సొమ్ము పంపిణీచేసి చేతులెత్తేశారు. మిగతా వారందరికి గురువారం పింఛన్ అందజేస్తామని భరోసా ఇచ్చారు.


ఏలూరులో వైసీపీ నాయకుడు మేతర సురేష్‌తో టీడీపీ నాయకుల వాగ్వాదం


అధికార పార్టీ ఛానల్ లైవ్ షూటింగ్ మీడియాకు కన్పించకుండా అడ్డుగా నిలబడిన పోలీసులు

వేడిగాలుల మధ్య బిక్కుబిక్కుమంటూ

ఒకరుకాదు ఇద్దరు కాదు వందలాది మంది బుధవారం పింఛన్ అందుకోవడానికి పడిన తిప్పలు అన్ని ఇన్నీ కావు. ఉదయాన్నే పింఛన్ పంపిణీ ప్రారంభిస్తామని అధికారులు చాలా గ్రామాల్లో టాంటాం వేయించారు. సచివాలయ సిబ్బందికి సంకేతాలు ఇచ్చారు. అయినా చాలాచోట్ల పింఛన్ సొమ్ముపై గడిచిన రెండు రోజులుగా దిగాలుపడిన కొందర్ని కనీసం అనునయించలేకపోయారు. దీనికితోడు పింఛన్లు ఇన్ని రోజులు అందకపోవడానికి తెలుగుదేశమే కారణమని నిందలు వేసేలా కొందరు వృద్ధుల ఎదుట ఓవరాక్షన్ చేశారు. తామే అండగా ఉంటామని కొందరు గప్పాలు పలికారు. బ్యాంకుల నుంచి పింఛన్ సొమ్ము ఉదయాన్నే డ్రా చేయాల్సి ఉంది. కాని ఆయా ఖాతాలకు తగినంత సొమ్ము రాకపోవడం దీనికి అనుగుణంగానే పూర్తి మొత్తాన్ని సచివాలయాలకు చేరవేయలేక బ్యాంకులు చేతులెత్తేశాయి. సచివాలయ సిబ్బంది పదేపదే పింఛన్ సొమ్ము విడుదల చేయాల్సిందిగా బ్యాంకర్లకు మొరపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ పరిస్థితిని గమనించి అధికారయంత్రాంగం బ్యాంకర్లకు ఆదేశాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. వయోవృద్ధులైన కొందరు సచివాలయాల ఎదుటే పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారంటూ ఫోన్‌లు వస్తుండటంతో ఏమీ పాలుపోక విలవిల్లాడారు. ఇంకొందరు అయితే మేం ఏం చేయగలమంటూ విసుగు ప్రదర్శించారు. ప్రత్యేకించి చాలాచోట్ల ఈ పరిస్థితి ఉన్నా బయటకు చెప్పుకోలేక కొందరు మిన్నకుండిపోయారు. కైకలూరు నియోజకవర్గ పరిధిలో ఒక్క కలిదిండి మినహా మిగతా మూడుమండలాల్లో సాయంత్రం నాటికి పింఛన్ల పంపిణీ ఆరంభమైంది. నూజివీడు నియోజకవర్గంలో సాయంత్రం నాటికి పంపిణీ ఆరంభమైనా సొమ్ము అతితక్కువగా విడుదల కావడంతో అందరికి సర్దుబాటు చేయలేకపోయారు. గురు,శుక్రవారాల్లో కూడా పంపిణీ సాగుతుందని చెప్పి పంపించారు. పోలవరం నియోజకవర్గపరిధిలో కుక్కునూరు, బుట్టాయిగూడెం మండలాల్లో పింఛన్ పంపిణీ ఆరంభం కాలేదు. కొయ్యలగూడెం, వేలేరుపాడు, జీలుగుమిల్లి మండలాల్లో 2గంటల తర్వాతే పంపిణీ చేశారు. టి.నరసాపురంలోనూ పంపిణీ వేగంగా చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. ఉంగుటూరు నియోజకవర్గపరిధిలోని ఉంగుటూరులో సాయంత్రం వరకు కేవలం 900 మందికి మాత్రమే పింఛన్ అందించారు. గణపవరం మండలం కొండేపాడులో రూ.6 లక్షలు పింఛన్ పంపిణీకి అవసరమై ఉండగా కేవలం రూ.12వేలు మాత్రమే బ్యాంకుల నుంచి అందడంతో సచివాలయం సిబ్బంది చేతులెత్తేశారు. నిడమర్రు మండలం అడవికొలనులో సాయంత్రం వరకు పింఛన్ల పంపిణీ ఆరంభం కాలేదు. దెందులూరు, పెదపాడు, పెదవేగి, చింతలపూడి, లింగపాలెం, జంగారెడ్డిగూడెం, కామవరపుకోటలో పింఛన్ల పంపిణీ అంతంత మాత్రంగానే సాగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం చేయాల్సిన పంపిణీలో కేవలం 48శాతం మేర మాత్రమే పూర్తి చేయగలిగారు. మిగిలిన 52శాతం మేర గురు,శుక్రవారాల్లో పంపిణీ చేయాలని భావిస్తున్నారు.

వైసీపీ యాక్షన్.. డైరెక్షన్

పింఛన్ల పంపిణీలో బుధవారం కొన్ని చోట్ల అనూహ్య సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఏలూరు నగర పరిధిలో వైసీపీ మద్దతుదారులు పింఛన్ల పంపిణీలో చాలాచోట్ల జోక్యం చేసుకున్నారు. మరికొన్నిచోట్ల పింఛన్‌దారులను ఒప్పించి టీడీపీకి వ్యతిరేకంగా అధికారపక్ష ఛానెల్లో బురద చల్లించేందుకు డైరెక్షన్ ఇచ్చారు. స్థానిక నూకాలమ్మ గుడిసమీపాన ఉన్న సచివాలయం వద్దకు ఉదయాన్నే పింఛన్‌దారులు అక్కడికి చేరుకున్నారు. ఇదే సమయంలో పింఛన్లు ఆలస్యం కావడానికి, మండుటెండలో పింఛన్‌దారులు ఇబ్బంది పడటానికి తెలుగుదేశమే కారణమనే నిందలు వేయాలని తదానుగుణంగానే ఛానెల్ ఎదుట మాట్లాడాలని కొందరు వైసీపీ నేతలే పింఛన్‌దారులకు డైరెక్షన్ ఇచ్చారు. దీన్ని గమనించిన టీడీపీ తక్షణం సచివాలయానికి చేరుకుంది. ఈలోపే జరుగుతున్న తంతును 'ఆంధ్రజ్యోతి' చిత్రీకరించటానికి ప్రయత్నిస్తే అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు ఫొటోగ్రాఫర్‌ను తోసివేశారు. అంతేకాకుండా సచివాలయ ప్రాంగణంలో అధికార పార్టీ ఛానెల్ షూటింగ్ చేస్తుండగా అది బయటకు కనిపించకుండా పోలీసులు అడ్డుగా నిలబడ్డారు. దీంతో టీడీపీ నేతలు కొందరికి చిరెత్తుకొచ్చి ఈ వ్యవహారాన్ని నిలదీశారు.

పెన్షన్ల పంపిణీ ప్రారంభం : జడ్పీ సీఈవో

ఏలూరు సిటీ : జిల్లాలో బుధవారం మధ్యాహ్నం నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభమైందని, అన్ని ఏర్పాట్లు చేసినట్టు జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు తెలిపారు. పెదపాడులో ఎస్‌బీఐ బ్యాంకును సందర్శించి పెన్షన్ నగదు బట్వాడాను పరిశీలించారు.


కైకలూరు 4వ సచివాలయం వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు


ద్వారకా తిరుమల సచివాలయం ముందు నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

కొండ కోనలు దాటి వచ్చినా..

బుట్టాయగూడెం : మారుమూల ఆటవీ ప్రాంతాల్లోని లబ్ధిదారులు, కొండ ప్రాంతాల్లోని వారికి మొదటి రోజు పింఛన్లు అందలేదు. ఎండలు మండకుండానే పింఛన్లు తీసుకుని ఇళ్లకు వెళ్లవచ్చని లబ్ధిదారులు మారుమూల అటవీ ప్రాంతాలు, కొండలు దిగి ఉదయాన్నే సచివాలయాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట దాటిన తర్వాత బ్యాంకుల్లో డబ్బులు లేవని చెప్పడంతో చేసేదిలేక వారంతా ఇంటిముఖం పట్టారు. మండల కేంద్రంలో బ్యాంకుల నుంచి డబ్బులు అందక పోవడంతో సాయంత్రం 4 గంటలు దాటిన పెన్షన్లు ఇవ్వలేదు. 5 గంటలు దాటాక జంగారెడ్డిగూడెం బ్యాంకుల నుంచి డబ్బులు తెచ్చి అందుబాటులో ఉన్న లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

ఆరు గంటలకూ.. ఎదురు చూపులే..

ద్వారకా తిరుమల : పింఛన్ల కోసం ద్వారకా తిరుమల సచివాలయం ముందు లబ్ధిదారులు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటలు దాటినా ఎదురు చూస్తూనే ఉన్నారు. సొమ్ము రాలేదని అధికారులు చెబుతున్నా వినకుండా గంటల తరబడి వారంతా నిరీక్షించారు.

రోజంతా పడి గాపులు..

పోలవరం : పెన్షన్ల కోసం పోలవరం మండలంలో పెన్షనర్లు రోజంతా పడిగాపులు కాయాల్సి వచ్చింది. మండలంలో 6,836 మంది లబ్ధిదారులు ఆయా సచివాలయాల పరిధిలో పెన్షన్ల కోసం సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల సచివాలయాలకు పెన్షన్ కోసం వచ్చిన వృద్ధులు సొమ్మసిల్లి సచివాలయంలో పడికేశారు. పెన్షన్లు ఇవ్వకపోవడంతో సాయంత్రం ఇంటి ముఖం పట్టాల్సి వచ్చింది.

సొమ్ము జమ కాక..

కుక్కునూరు : మండలంలో పింఛన్ల పంపిణీ ప్రారంభం కాలేదు. బ్యాంక్‌లో సొమ్ము జమ కాకపోవడంతో పంపిణీ జరగలేదని ఈవోపీఆర్‌డీ మోహన్ తెలిపారు. గురువారం లబ్ధిదారులకు పింఛన్ సొమ్ములు అందజేస్తామన్నారు.

మండుటెండలో పాట్లు..

ముదినేపల్లి : ముదినేపల్లి పోల్ రాజ్ కెనాల్ గట్టుపై నివాసముంటున్న దుర్గమ్మ అనే వృద్ధురాలు పెయ్యేరు సచివాలయానికి ఉదయం 11 గంటలకు వెళ్లగా, సాయంత్రం 4.30 గంటలకు పెన్షన్ తీసుకుంది. ముదినేపల్లిలో పరసా ప్రమీలా రాణి (80)అనే వృద్ధురాలు, పరసా నాగేశ్వరరావు అనే దివ్యాంగురాలు మండుటెండలో సచివాలయానికి వచ్చి పెన్షన్ తీసుకున్నారు.


ఏలూరులో వృద్ధుడు, ముదినేపల్లిలో దివ్యాంగురాలు, వృద్ధురాలు..


సుంకరవారితోటలో పెన్షన్ ఇవ్వకపోవడంతో పింఛన్‌దారుల ఇంటిదారి..


ఏలూరులో శేఖర్‌వారి ఏరియా సచివాలయం వద్ద మండుటెండలో..

సమ్మెకాలం.. వేతనాలేవీ జగనన్న ?

- నమ్మించి మోసం.. అంగన్‌వాడీల ఆగ్రహం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 3 : మూడునెలల కిందట తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు సమ్మెబాట పట్టారు. సమస్యల పరిష్కారం మాట ఎలా ఉన్నా, వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. సమ్మె విరమించి ఇప్పటికి రెండు నెలలు పూర్తయినా సమ్మె కాలానికి సంబంధించి వేతనాలు రాలేదని అంగన్‌వాడీలు ఆవేదన చెందుతున్నారు. కనీస వేతనం, తదితర సమస్యల పరిష్కారం కోసం గతేడాది డిసెంబరు 8న అంగన్‌వాడీలు సమ్మె ప్రకటన చేయగా ప్రభుత్వం చర్చలకు పిలవడంతో డిసెంబరు 12 వరకు వాయిదా వేశారు. చర్చల్లో ప్రభుత్వం ఏ హామీ ఇవ్వకపోవడంతో డిసెంబరు 12న సమ్మెకు దిగారు. ఈ ఏడాది జనవరి 23వరకు ప్రభుత్వం, అధికారులు ఎన్ని రకాలుగా భయపెట్టినా, ఎస్మా ప్రయోగించినా 42 రోజుల పాటు సమ్మె చేశారు. తొలగింపు ఉత్తర్వులు వారి ఇళ్లకే పంపించారు. చివరకు ప్రభుత్వం దిగి వచ్చి 2024, జూన్‌లో సమస్యలపై చర్చలు జరుపుతామని, సమ్మె కాలానికి వేత నాలు ఇస్తామని హామీ ఇవ్వడంతో అర్ధాంతరంగా ఆందోళన విరమించారు. కాని సమ్మె విరమించి రెండునెలలు దాటినా నేటివరకు సమ్మె కాలానికి వేతనం అందలేదు. కోడ్ అమలులోకి రావడం, ఎన్నికల హడావుడి నేపథ్యంలో జీతాలు రావడం అనుమానమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ముందుగానే సమ్మెకాలపు జీతాలు ఇస్తే బాగుండేదని, నమ్మించి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మామి'ఢీ'లా!

- నాలుగో వంతుకు పడిపోయిన దిగుబడులు
- మూడు రెట్లు పెరిగిన రసాయన పురుగుమందుల వాడకం
- మార్కెట్ల స్థిరత్వం పైనే రైతుల ఆశలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 3 : దిగుబడులు ఉంటే మార్కెట్ లేక, మార్కెట్ ఉంటే నాణ్యత లోపాలతో మామిడి రైతులు ఏటా ఢీలా పడుతున్నారు. శతాబ్దాల చరిత్ర కలిగిన నూజివీడు మామిడి అననుకూల పరిస్థితుల నేపథ్యంలో కనుమరుగయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గత ఐదేళ్లుగా వరుస అవరోధాలతో మామిడి రైతు పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. 2019 నుంచి 2021 వరకు కొవిడ్ ప్రభావంతో మార్కెట్లు సక్రమంగా లేక కాపును తోటల్లోనే వదిలివేసిన ఘటనలు ఉన్నాయి. 2022 నుంచి ఈ సీజన్ వరకు చీడపీడల ఉధృతితో మామిడిలో నాణ్యత లోపాలు ఏర్పడుతు న్నాయి. ఈ ఏడాది పూత సమయంలో తుఫాన్ ప్రభావంతో భారీవర్షాలు పడడంతో పూతలు ఆలస్యమయ్యాయి. సాధారణంగా మామిడిలో పూత సీజన్ డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు ఉండగా, ప్రస్తుత సీజన్‌లో జనవరి నెలాఖరు నుంచి మార్చి వరకు కొనసాగింది. అదే సందర్భంలో మామిడిలో ఎర్రనల్లి, రాతిమంగు పురుగుల ఉధృతి కొనసాగడంతో మామిడి తోటలో దాదాపు నాలుగురెట్లు పురుగు మందులు పిచికారీ చేయాల్సి రావడంతో రైతులపై అదనపు భారం పడింది. ఏటా మార్చి ప్రథమార్ధంలో మామిడి కాయలతో మార్కెట్లు కళకళలాడాల్సి ఉండగా, ఏప్రిల్ ప్రథమార్ధానికి కూడా మార్కెట్లకు కాయలు అనుకున్నరీతిలో రావడం లేదు. జిల్లా పరిధిలోని నూజివీడు సబ్ డివిజన్ పరిధిలో సుమారు 30వేల హెక్టార్లలో మామిడి సాగులో ఉంది. ఇక్కడినుంచి సౌదీ అరేబియా, అమెరికా, ఇంగ్లాండ్ తదితర అంతర్జాతీయ మార్కెట్లకు, ముంబై, అమరావతి, కోల్‌కత్తా, నాగ్‌పూర్ వంటి జాతీయ మార్కెట్లకు మామిడి విస్తారంగా ఎగుమతి అయ్యేది. మామిడి సాగులో ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో ఉండగా, అందులో ఉమ్మడి కృష్ణా జిల్లాలో అత్యధికంగా మామిడి సాగులో ఉంది. ఇక్కడి నుంచి సరాసరి మూడున్నర నుంచి నాలుగున్నర లక్షల టన్నులు మామిడి దిగుబడులు వచ్చేవి. ఐదేళ్లుగా కాలం కలిసిరాక దిగుబడులు ఉంటే మార్కెట్ లేక, మార్కెట్ ఉంటే నాణ్యత పడిపోయి అనే చందాన మామిడి రైతు అప్పుల ఊబిలోకి వెళ్లడంతో మామిడి తోటలు సస్యరక్షణలోనూ రైతులు వెనుకంజ వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా దాని ప్రభావం మామిడి దిగుబడులపై గణనీయంగా పడడంతో ప్రస్తుత సీజన్‌లో నాలుగో వంతుకు దిగుబడులు పడి పోయాయి. ఏ మామిడితోట చూసినా ఖాళీ చెట్లతో కనిపించడంతో రైతులు డీలా పడాల్సిన పరిస్థితి నెలకొంది. గత రెండు దశాబ్దాల్లో ఈ పరిస్థితులు తామెప్పుడూ చూడలేదని రైతులు చెబుతున్నారు.


కాపులేని మామిడి తోట


మామిడిపై ఎర్రనల్లి ప్రభావం

మామిడి పూత సమయంలో ఎర్రనల్లి ప్రభావం పడటంతో తోటల్లో పూత వచ్చినా అవి పిందెకట్టుగా మారలేదని రైతులు వాపోతున్నారు. ఎర్రనల్లి నివారణకు ఉద్యానవనశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సరైన సూచనలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని, దాని ప్రభావం తోటలపై పడిందని రైతులు వాపోతున్నారు.

తల్లీ బిడ్డ ఆరోగ్య సంరక్షణలో జిల్లాకు ప్రథమ స్థానం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 3 : తల్లీ బిడ్డల, గర్భిణుల ఆరోగ్య సంరక్షణ (ఆర్‌సీహెచ్) వివరాల నమోదు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ, ప్రసవాలు ప్రామాణికాలుగా జిల్లా వైద్యఆరోగ్యశాఖకు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం లభించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు అనుబంధంగా రాష్ట్రంలో పనిచేసే రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లాకు పంపిన సమాచారాన్ని బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట ఓ ప్రకటనలో తెలిపారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికి (2023-24) సంబంధించి జాతీయ స్థాయిలో తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల అమలుపై గణాంకాలను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఆర్‌సీహెచ్ నమోదులో భాగంగా జిల్లాలో మొత్తం 32,207 మంది (95.28శాతం) గర్భిణుల నమోదు, తొలి మూడు నెలల గర్భిణుల నమోదులో 28,709 మంది (89.14శాతం), ప్రమాదకర (హైరిస్క్) గర్భిణుల గుర్తింపులో 5,751 మంది నమోదులో ప్రథమ స్థానం జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు లభించిందన్నారు. ఈ మూడు అంశాలను కొలమానంగా తీసుకుని రాష్ట్రాల వారీగా జిల్లాల ప్రగతి, సాధించిన స్థానాలను కేంద్రం ప్రకటిస్తుందన్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఇతర వైద్య సిబ్బంది సమష్టి కృషి వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ గుర్తింపు వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రసవాలు జరిపే ప్రభుత్వాస్పత్రుల్లో అదనపు సౌకర్యాలు కల్పన, నిధుల కేటాయింపులో ప్రాధాన్యతనివ్వడం వంటి ప్రయోజ నాలను కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వోను పలువురు జిల్లా అధికారులు అభినందించారు.

'పోలవరం' బొరగానికి కేటాయించాలి..



భీమడోలు, ఏప్రిల్ 3 : పోలవరం స్థానాన్ని కూటమి అభ్యర్థిగా బొరగం శ్రీనివాస్‌కు కేటాయిం చాలని లేని పక్షంలో జనసేన అభ్యర్థిత్వం ఇచ్చి ఆ పార్టీ నుంచి అయినా ఆయనను బరిలోకి దింపాలని నియోజకవర్గ ముఖ్య నాయకులు తీర్మానించారు. భీమడోలులోని ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు క్యాంపు కార్యాలయంలో పోలవరం నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. రాబోయే ఎన్నికల్లో పోలవరం అభ్యర్థిగా బొరగంను నిలబెట్టకపోతే గెలుపు సాధ్యం కాదని గన్ని వీరాంజనేయులు దృష్టికి పోలవరం నాయకులు తీసుకొచ్చారు. ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌ను కలిసి దీనిపై అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. గన్ని మాట్లాడుతూ నల్లజర్లలో ప్రజాగళం సభకు చంద్రబాబు రానున్న నేపథ్యంలో ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యమని ఆయన మాటకు కట్టుబడి అందరూ పని చేయాలని, కూటమి అభ్యర్థిని గెలిపించాలన్నారు. పోలవరం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

వీడియో గ్రాఫర్ తొలగింపు

పెదవేగి, ఏప్రిల్ 3 : దెందులూరు నియోజకవర్గం ఫ్లయింగ్ స్క్వాడ్‌లో వీడియో గ్రాఫర్‌గా పనిచేస్తున్న పామర్తి నాగరాజును ఆ విధుల నుంచి తొలగించామని జిల్లా సంయుక్త కలెక్టర్, దెందులూరు ఎన్నికల అధికారి బి.లావణ్యవేణి ఓ ప్రకటనలో తెలిపారు. పామర్తి నాగరాజు వైసీపీకి చెందిన వ్యక్తి అని, అతనిని ఎన్నికలకు సంబంధించిన ఫ్లయింగ్ స్క్వాడ్ నుంచి తొలగించాలని పేర్కొంటూ, ఆధారాలతో సహా టీడీపీ నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన అనంతరం అతనిని తొలగించామని లావణ్యవేణి వివరించారు.

రబీ ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు

- 120 ఆర్‌బీకేల ద్వారా కొనుగోళ్లు..10వ తేదీ అనంతరం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- ఈ ఏడాది దిగుబడి అంచనా 3.11 లక్షల టన్నులు

ఏలూరు సిటీ, ఏప్రిల్ 3 : జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది రబీలో వరి పంటను 79,960 ఎకరాల్లో సాగు చేశారు. 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 120 ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లను చేయడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. పంట దిగుబడి 3.11 లక్షల టన్నుల వరకు వస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈనెల 10వ తేదీ తర్వాత ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని 22 మండలాల్లో ధాన్యం వస్తుందని, ఎక్కువగా భీమడోలు, ఉంగుటూరు, దెందులూరు, నిడమర్రు మండలాల్లో ధాన్యం ఉత్పత్తి అవుతుందని, అయా మండలాల వారీగా ఏ రోజు ఎంత మేరకు ధాన్యం వస్తుందనే అంశాన్ని పరిగణలోకి తీసుకుని సంబంధిత కార్యాచరణ రూపొందించాలని ఇప్పటికే జేసీ లావణ్యవేణి వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. కనీస మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయడానికి జిల్లాలో 67 కొనుగోలు సహాయక కేంద్రాలను 120 ఆర్‌బీకేలకు అనుసంధానం చేశారు. వీటిలో సహకార సొసైటీల నుంచి 52, డీసీఎంఎస్ నుంచి 10, ఎఫ్‌పీవో నుంచి 5 కొనుగోలు సహాయక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి అవసరమైన సాంకేతిక సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.

77 లక్షల గోనె సంచులు అవసరం

ధాన్యం కొనుగోలుకు 77 లక్షల గోనె సంచులు అవసరం అవుతాయని అంచనా వేశారు. పాడైన, చిరిగిన గోనె సంచులను సరఫరా చేయకుండా వీలైనంతవరకు కొత్త సంచులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ ఇప్పటికే అధికారులను ఆదేశించారు. గోనె సంచులు నిల్వ చేసేందుకు అయా మండలాల్లో స్టోరేజ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ధాన్యం తరలింపులో రైతు తాము సొంతంగా వాహనం, కార్మికుల ఖర్చు, గోనె సంచులకు చెల్లిస్తే వాటిని రైతుకు చెల్లిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొనుగోలు కేంద్రాల నిర్వహణలో రాజకీయ వ్యవహారాలకు తావు లేదని చెబుతున్నారు. ధాన్యం సేకరణ కేంద్రాలు, రైస్ మిల్లులను అనుసంధానం చేసే ప్రక్రియ జరుగుతోంది. ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ ట్యాగింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,203, కామన్ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2,183 చెల్లించనున్నారు. రైతులకు గ్రామ సభల ద్వారా ధాన్యం నాణ్యతా ప్రమాణాలపై, రైతులకు చెల్లించే గోనె సంచుల వినియోగ రుసుం (సంచికి రూ.3.39 పైసలు), హమాలీల ఖర్చు, ధాన్యం రవాణా ఖర్చుపై అవగాహన కల్పించాలని నిర్ణయించారు.



భీమడోలు వద్ద తనిఖీల్లో సొమ్ము స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

రూ.5,29,600 సీజ్

విస్తృతంగా తనిఖీలు

కామవరపుకోట/భీమడోలు/చింతలపూడి,/ఉంగుటూరు / జీలుగుమిల్లి, / ఏలూరు క్రైం ఏప్రిల్ 3. సార్వత్రిక ఎన్నికల నేప థ్యంలో స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేస్తు న్నాయి. కొత్తూరు చెక్‌పోస్టు వద్ద బుధవారం ఉంగు టూరు మండలం నల్లమాడు గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి లక్షా ఆరు వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ రమేష్ తెలిపారు. మంగళవారం రాత్రి తనిఖీల్లో రూ.76,600 నగదు స్వాధీనం చేసు కున్నామన్నారు. ఎన్నికల స్క్వాడ్ అధికారిణి సత్య వాణి ద్వారా ఏలూరు ఎన్నికల ట్రెజరీ అధికారికి పంపిం చామన్నారు. ఎన్నికల అధికారి ఎండీ మొహిద్దీన్, తడికల పూడి ఎస్ఐ జయబాబు, ఏఎస్ఐ వీరాస్వామి, వీఆర్వో బాబూరావు, కె.రామకృష్ణ, జి.సూర్యారావు, నాగార్జున, షేక్ నాగూర్ సాహెబ్, సౌజన్ సాయి తదితరులు ఉన్నారు.

- భీమడోలు మండలం గుండుగొలను హైవేపై ఫ్లైయింగ్ స్క్వాడ్ జరిపిన తనిఖీల్లో లక్ష రూపాయల నగదు గుర్తించి స్వాధీన పర్చుకున్నట్లు ఏలూరు ఆర్డీవో, ఆర్వో ఖాజావలీ తెలిపారు.
- చింతలపూడి మండలం అల్లిపల్లి చెక్‌పోస్టు రూ.70 వేలు నగదుకు ఎటువంటి పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసి జిల్లా ట్రెజరీకి జమ చేసినట్లు సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ తెలిపారు.
- ఉంగుటూరు వద్ద ఫ్లైయింగ్ స్క్వాడ్ బుధవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించగా కారులో రూ.77 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఆర్వో ఖాజావలి తెలిపారు.
- తాటియాకులగూడెం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అశ్వారావు పేట నుంచి మక్కినవారిగూడెం వెళుతున్న కారు తనిఖీ చేయగా రూ.లక్ష నగదు గుర్తించారు. నగదు ట్రెజరీకి అప్పగించనున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ చెప్పారు.
- సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 28 వేల 130 రూపాయలు విలువైన 69.01 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాలుగు లక్షల 67 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు అని తెలిపారు.

తాటియాకులగూడెం సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న రూ.లక్ష నగదు చూపుతున్న అధికారులు



- ఏలూరు చొదిమెళ్ళకు చెందిన భానుసుందర్ ఫిలిప్పైన్స్‌లో ఎంబీబీఎస్ చదివాడు. ఫోన్‌లో క్రికెట్ బెట్టింగు యాప్‌లలో బెట్టింగ్‌లు ఆడి లక్షల్లో పోగొట్టుకున్నాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక అప్పులు ఇచ్చిన వారికి వైద్యం పేరుతో మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి అనారోగ్యం పాలు చేయడం, హతమార్చడానికి కూడా వెనుకాడలేదు. రెండు రోజుల క్రితం ఏలూరు పోలీసులు ఆ డాక్టర్‌ను అరెస్టు చేశారు.
- గతంలో భీమవరం మండలానికి చెందిన ఒక యువకుడు క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లోవారు ఎంత చెప్పినా వినకుండా బెట్టింగ్‌లకు కాయడంతో అప్పుల పాలయ్యాడు. చివరకు ఉన్న ఆస్తిని అమ్మినా కూడా అప్పులు తీరలేదు. ఆ కుటుంబం రోడ్డున పడింది.
- భీమవరం శివారు ప్రాంతానికి చెందిన ఒక యువకుడు రొయ్యల చెరువులు చేస్తూ బాగా సంపాదించాడు. అయితే కొంతకాలానికి క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. చెరువుల్లో రొయ్యలు ఉన్నా సరే వాటిని పట్టించుకోకుండా రాత్రీ, పగలు బెట్టింగ్‌ల్లో మునిగి తేలాడు. చివరకు సంపాదించినదంతా అప్పులకు సరిపోలేదు. ఇలా బెట్టింగ్‌ల భూతానికి ఎంతోమంది బలవుతున్నారు..



బెట్టింగ్ భూతం



జోరుగా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగులు

అప్పుల్లో కూరుకుపోతున్న కుటుంబాలు

తీర్చలేక ఆత్మహత్యలు

నాడు బుకీలు.. నేడు ఆన్‌లైన్ యాప్‌లు

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, ఏప్రిల్ 3: క్రికెట్ అంటే ఇష్టపడని వారు ఉండరు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ టీవీలో క్రికెట్ వస్తుంటే చూడకుండా ఉండలేరు. ఇష్టం ఉంటే పర్వాలేదు..కానీ అది బెట్టింగుల వైపు మళ్లిందంటే జీవితాలే సర్వనాశనం అయిపోతాయి. ఐపీఎల్ మ్యాచ్‌లు వచ్చాక చాలామంది బెట్టింగుల మాయలో మునిగిపోతున్నారు. ఎంతో మంది క్రికెట్ బెట్టింగుల వల్ల అప్పుల పాలవుతున్నారు. వాటిని తీర్చే మార్గం లేక, బుకీల వేధింపులు భరించలేక చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు.

బెట్టింగ్ రకరకాలు

ఐపీఎల్‌లో మొదటి ఆరు ఓవర్లకు ఎన్ని రన్స్ తీస్తారో దీనిని మొదటి ఫ్యాన్సీ అంటారు. దీనిపైన పందాలు కడతారు. ఇక రెండవ ఫ్యాన్సీ 7,8,9,10 ఓవర్లపై పందాలు నిర్వహిస్తారు. మూడో ఫ్యాన్సీగా 11వ ఓవర్ నుంచి 15 ఓవర్ వరకూ ఎన్ని రన్స్ తీస్తారు లేదా ఎన్ని వికెట్లు తీస్తారు అనే దానిపై మూడో ఫ్యాన్సీగా రెట్టింపు పందేలు కాస్తారు. నాల్గో ఫ్యాన్సీగా 16 నుంచి 20 ఓవర్ల మధ్యలో ఎన్ని వికెట్లు, ఎన్ని ఓవర్లు లేదా ఏ బ్యాట్స్‌మెన్ ఔట్ అయిపోతాడో రెట్టింపు పందాలు కాస్తారు. ఏ టీమ్ గెలుస్తుందో కూడా తాడోపేడో తేల్చేలా పందాలు కాస్తారు.

ఐపీఎల్ అంటే



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17 సంవత్సరాల క్రితం భారత దేశంలో ప్రారంభించారు. అప్పటి వరకూ ఉన్న క్రికెట్ విధానం వేరు. ఐపీఎల్ ఆట విధానం వేరు. భారత దేశంలో 12 టీమ్‌లు, 20 ఓవర్స్ చొప్పున ఆటను ఆడతాయి. దీనినే 20-20 అని అంటారు. 17వ సారి భారత దేశంలో ప్రస్తుతం 12 టీమ్‌లతో 74 మ్యాచ్‌లు జరుగుతున్నాయి. శనివారం, ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఒక మ్యాచ్, రాత్రి 7.30కి మరో మ్యాచ్ జరుగుతాయి. మిగిలిన రోజుల్లో రోజుకు ఒక మ్యాచ్ చొప్పున క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతాయి.

యాప్‌ల ద్వారా బెట్టింగ్‌లు

గతంలో క్రికెట్ బుకీలు పందాలు కాస్తూ ఉండేవారు. వారు ఒక హోటల్‌లోనో, లాడ్జీ రూమ్‌ల్లోనూ, ఒక ఇంట్లోనో టీవీ పెట్టుకుని, మొబైల్స్ పెట్టుకుని పందాలు నిర్వహించేవారు. నేడు ఆన్‌లైన్‌లో వివిధ యాప్‌లు రావడంతో వంద రూపాయల నుంచి కోట్లాది రూపాయల వరకూ యాప్‌ల్లో జోరుగా సాగుతున్నాయి. జిల్లాలో వేలు, లక్షల రూపాయల్లో మాత్రమే పందాలు సాగుతున్నాయి. కొన్ని యాప్‌లలో మినిమం వంద రూపాయల నుంచి ప్రారంభం కాగా, కొన్ని యాప్‌లలో వెయ్యి రూపాయల నుంచి ప్రారంభం అవుతున్నాయి. జిల్లాలో అత్యధికంగా బాక్స్ బెట్టింగులు ఎక్కువగా జరుగుతున్నాయి. క్రికెట్ బుక్కీల పరిభాషలో బాక్స్ అంటే లక్ష రూపాయలు పందెం అని అర్థం. ఇక ఎన్ని బాక్స్‌లు అంటే అన్ని లక్షలు పందెంలో పెడుతున్నట్లు. బుకీలు 20 శాతం సొమ్ములను తీసుకుని మిగిలిన సొమ్ము ఇస్తారు. పందాలు కాసేవారు పాత వారు అయితే అప్పుల్లో కూడా పందాలు కడుతూనే ఉంటారు. అప్పులు తీర్చకపోతే నేరుగా రికవరీ బృందం దిగిపోతుంది. ఇళ్ళకు బంధువులు, స్నేహితుల రూపంలో వచ్చి ఇంట్లో తలుపులు వేసి పంచాయతీ పెడతారు. క్షణాల్లో వారి నుంచి చెక్కులు, ప్రామిసరీ నోట్లు, ఆస్తులకు సంబంధించిన డాక్యు మెంట్లను స్వాధీనం చేసుకుని వెళ్ళిపోతారు. లేదా ప్రాణాలు తీస్తామంటూ బెదిరిస్తారు.బెదిరింపులు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడు తున్నారు.

తల్లిదండ్రులే దృష్టి పెట్టాలి

జిల్లాలో పేద వాడి నుంచి ధనికుడి వరకూ చిన్న ఉద్యోగుల నుంచి కొంత మంది పెద్ద ఉద్యోగులు కూడా ఈ బెట్టింగ్‌ల బారినపడ్డట్లుగా తెలుస్తోంది. నేరుగా వారి మొబైల్స్‌లోని ఆండ్రాయిడ్ ఫోన్‌లోనే క్రికెట్ బెట్టింగు యాప్‌లను డౌన్‌లోడు చేసుకుని బెట్టింగుల్లో కూరుకు పోతున్నారు.తల్లి దండ్రులు తమ పిల్లలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా ఎక్కువ శాతం మంది యువతే ఈ బెట్టింగులకు పాల్పడు తున్నట్లు తెలుస్తున్నది. తెలిసీ తెలియని వయస్సుల్లో క్రికెట్ పట్ల ఆకర్షణకు గురై ఆపై క్రీడాకారులపై అభిమానాన్ని పెంచుకుని బెట్టింగులకు పాల్పడు తున్నారు. ఇలాంటి వారిని ప్రాథమిక దశలోనే గుర్తించి తల్లిదండ్రులే కౌన్సెలింగ్ ఇవ్వాలి.

క్రికెట్ బెట్టింగ్‌లు, జూదాలు వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. వాటి జోలికి ఎవరూ వెళ్ల వద్దు. చాలామంది గతంలో క్రికెట్, జూదాలు వల్ల చాలా ఇబ్బందులు పడ్డారు. కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. విద్యార్థులు, యువత కూడా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. కేసుల్లో ఇరుక్కుంటే బంగారు భవిష్యత్తు నాశనమవుతుంది. తల్లిదండ్రులు కూడా పిల్లలపై దృష్టి పెట్టాలి.



చిన్నారులతో ఆటలా..



ఎస్సీ, ఎస్టీలకు కార్పోరేట్ విద్య
విద్యాహక్కు చట్టం అమల్లో తికమక
1,162 విద్యార్థులకు ఫీజు భారం
స్కూళ్లకు చెల్లించిన ప్రభుత్వం

భీమవరం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 : నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేలా గత టీడీపీ ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్ ప్రవేశపెట్టింది. 1 నుంచి 10 వ తరగతి వరకు విద్యార్థులు తాము ఎంచుకున్న స్కూళ్లలో చదువుకునేందుకు అవకాశం ఇచ్చింది. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలలకు సొమ్ములు జమ చేసేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ స్కీమ్‌ను పక్కన పెట్టి విద్యా హక్కు చట్టం అని కొత్త పథకం తీసుకు వచ్చింది. ఈ పథకం సక్రమంగా అమలు చేయకుండా చిన్నారులతో ఆటలాడుతోంది. ప్రభుత్వం ఫీజుల చెల్లింపుల్లో గందరగోళం కాస్తా విద్యార్థుల తల్లితండ్రులకు భారంగా మారింది. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లాలో 1,162 మంది విద్యార్థులు విద్యాహక్కు చట్టం కింద 139 ప్రైవేటు పాఠశాలలో 1వ తరగతిలో చేరారు. విద్యా సంవత్సరం పూర్తయింది. ప్రభుత్వం పాఠశాలలకు సొమ్ములు చెల్లించకపోవడంతో ఫీజులు కట్టాల్సిందేనని స్కూల్ యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయి. విద్యార్థుల తల్లితండ్రులు విద్యా శాఖల చుట్టూ తిరిగినా సమాధానం మాత్రం దొరకడం లేదు. గతేడాది జూన్‌లో వీరికి అడ్మిషన్లు తీసుకోవడంతో అమ్మఒడికి వీరు నమోదు కాలేదు. 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభం జూన్ నెలలో అమ్మఒడి పడుతుందని ఆ సొమ్ములు జమ చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు చెబుతుండడంతో స్కూళ్ల యాజమాన్యాలు లబోదిబోమంటున్నాయి. ప్రభుత్వ విధానాలతో ఇటు తల్లిదండ్రులతో పాటు పాఠశాలల యాజమన్యాలకు దిక్కుతోచడం లేదు. అమ్మఒడితో సంబంధం లేకుండా ఫీజు చెల్లించాల్సిన వైసీపీ ప్రభుత్వం ఇలా కొర్రీ పెట్టడం విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 3 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో వీరి పరిస్థితి ఎలా ఉంటుందో మరి..

బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ పక్కన పెట్టి..

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేటు స్కూల్స్‌లో ఉచితంగా చదువుకునే అవకాశం కల్పిస్తూ టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌ను వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. దీంతో ఆ పథకంలో లబ్ధి పొందే వందల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులు వారి దగ్గరలో ఉన్న కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లలో చదువుకునే అవకాశం కోల్పోయారు. ఉన్న విద్యా సౌకర్యాలను తీసేసి విద్యార్థులను ఇబ్బందుల పాలు చేస్తున్న వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న ఉపాధి కూలీలు

కూలీ సొమ్ములు నొక్కేసిన వలంటీర్

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఉపాధి హామీ పథకం కూలీలు

ఆకివీడురూరల్ ఏప్రిల్ 3 : ఆకివీడు మండలం కుప్పనపూడి సచివాలయంలో వలంటీర్ తమ ఉపాధిహామీ కూలీ సొమ్ము దోచేసిందని గ్రూపు సభ్యులు ఆరోపించారు. కుప్పనపూడి గ్రామంలో ఉపాధిహామీ పనులు బాధ్యత తీసుకున్న వలంటీర్ వీరమల్లు వెంకటేశ్వరమ్మ సుమారు రూ.4 లక్షలు వరకు నగదు స్వాహా చేసిందని చెబుతున్నారు. గ్రామంలో సుమారు 100 మంది వరకు ఉపాధి కూలీలుగా పనిచేస్తున్నామని తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి జూలై వరకు తమచే 40, 50, 60 పనిదినాలు చేయించి మస్టర్‌లో 100 పనిదినాలుగా చూపించిందని తెలిపారు. చేసిన పనిదినాలకు నగదు పోస్టాఫీసు ఖాతాలో జమకావాల్సి ఉండగా, ఫినో ఎకౌంటు ద్వారా వేలి ముద్రలు తీసుకుని నగదు అందజేస్తున్నదని ఆరోపించారు. ఎవరైనా అడిగితే తమకు పని కల్పించకుండా కొత్తవారికి పని చూపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్‌కార్డు, కొత్త పుస్తకాలు ఇప్పిస్తానని రూ. 20 వసూలు చేసి, ఇప్పటి వరకు అందజేయలేదని తెలిపారు. దీనిపై మార్చి 28వ తేదీన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రేపు రాష్ట్ర స్థాయి అండర్-17 చదరంగం పోటీల క్రీడాకారుల ఎంపిక

భీమవరం అర్బన్, ఏప్రిల్ 3: పశ్చిమ గోదావరి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలోఈ నెల 5న భీమవరం అనసూయ చెస్ అకాడమీలో జిల్లా స్థాయి అండర్ 17 బాయ్స్, గరల్స్ చదరంగ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే వారు 1-1-2007వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలని, పోటీల్లో గెలుపొందిన వారు ఈనెల 20, 21 తేదీల్లో గుడివాడలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-17 పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.వివరాలకు 90632 24466 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

విద్యుత్ చౌర్యం కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 : ఒక వడ్రంగి మేస్త్రీ అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నాడని సమాచారం అందుకున్న జిల్లా విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి అతనిపై కేసు నమోదు చేసి జరిమానా విధించారు. కొయ్యలగూడెం మండలం డిప్పకాయలపాడులో ఉప్పటి సోమరాజు కార్పెంటరీ షాపు నిర్వహిస్తున్నారు.అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు ఏలూరు జిల్లా విజిలెన్స్ అధికారులకు సమాచారం అందడంతో ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వారి సిబ్బందితో దాడి నిర్వహించారు. అతనిపై విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేసి 68,155 రూపాయలు అపరాధ రుసుం, ఏడు వేల రూపా యల జరిమానా విధించారు. జిల్లాలో ఎవరైనా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రవికుమార్ తెలిపారు.



ఐలు శిక్షణా తరగతుల కరపత్రం విడుదల చేస్తున్న యూనియన్ సభ్యులు

వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోండి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 : ఆల్ ఇండియా లాయర్ యూనియన్ (ఎఐ ఎల్‌యు) ఈనెల 6న ఏలూరులో నిర్వహించనున్న తరగతులకు జూనియర్ న్యాయవాదులు హాజరై వృత్తి నైపుణ్యతను పెంపొందిం చుకోవాలని ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయకుమార్ పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం జరిగిన సమావేశంలో యూనియన్ సభ్యులు శిక్షణ తరగతుల కరపత్రాన్ని విడుదల చేశారు. ఐలు జిల్లా కమిటీ కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ తరగతులకు 1వ అదనపు సెషన్స్ న్యాయాధికారి రామగోపాల్, ఐలు రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షుడు రాజగోపాల్, నర్రా శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు రోనాల్డ్‌రాజు, బీవీ కృష్ణారెడ్డి, నాగరాజు, విజయభాస్కర్, ఐలు జిల్లా అధ్యక్షురాలు శైలజ పాల్గొంటారని తెలిపారు.

కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులస్థులకు బీసీలతో సమానంగా సౌకర్యాలు కల్పించాలి : జోగయ్య

పాలకొల్లు, ఏప్రిల్ 3: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అధినాయకులకు కాపు, బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి వెంకట హరిరామ జోగయ్య బుధవారం ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులస్తులు బ్రిటీష్ కాలంలోనే బీసీలుగా పరిగణించబడి ఉన్నారని, వివిధ కారణాల రీత్యా వారిని ఓసీలుగా మార్పు చేశారన్నారు. సమాజంలో 25 శాతం జనాభా కలిగిన కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులస్థులకు బీసీలతో సమానంగా సంక్షేమ సౌకర్యాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

3-04-2024 పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్టం	కనిష్టం	సరాసరి
దేవరపల్లి	241	236	239.73
జంగారెడ్డిగూడెం-1	242	235	239.97
జంగారెడ్డిగూడెం-2	241	235	239.84
కొయ్యలగూడెం	240	237	239.99
గోపాలపురం	240	235	238.59

అలంపురం పంచాయతీకి పవర్ కట్ !

బిల్లులు చెల్లించలేదని సరఫరా నిలిపివేసిన అధికారులు
10.27 లక్షలు చెల్లించాలంటూ నోటీసులు
చెల్లించాల్సింది 3.55 లక్షలే : సర్పంచ్





విలేకర్ల తో మాట్లాడుతున్న సర్పంచ్ తాతపూడి ప్రగతి

పెంటపాడు, ఏప్రిల్ 3 :పెంటపాడు మండలం అలంపురం పంచాయతీలో చీకట్లు అలుముకున్నాయి. బిల్లులు చెల్లించలేదని అధికారులు కార్యాలయానికి విద్యుత్ నిలిపివేశారు. తాము చెప్పేది వినకుండా విద్యుత్ శాఖ అధికారులు పవర్ కట్ట చేశారని సర్పంచ్ తాతపూడి ప్రగతి ఆరోపించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రూ.10,27,707 విద్యుత్ బకాయి చెల్లించాల్సిందిగా పంచాయతీ కార్యాలయానికి అధికారులు డిమాండ్ నోటీస్ పంపించారన్నారు. 2021 మార్చిలో 14వ ఆర్థిక సంఘం నిధులతో రూ 37,99,122 విద్యుత్ బకాయిల కోసం చెల్లించామన్నారు. వాస్తవానికి తాము అప్పుడు రూ.6 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. అయితే నిధులు వెనక్కి మళ్లిపోతాయన్న ఉద్దేశంతో అదనంగా చెల్లించామన్నారు. రూ.6 లక్షలు జమ కాగా ఇంకా తమ పంచాయతీ నిధులు సుమారు రూ.32 లక్షలు విద్యుత్ శాఖ వద్దే ఉన్నాయన్నారు. అప్పటి నుంచి విద్యుత్ బిల్లులు పోను పంచాయితీకి సుమారు రూ.6,72,137 విద్యుత్ శాఖ నుంచి రావల్సి ఉందన్నారు. ఇప్పుడు రూ.10,27,707 లక్షలు చెల్లించాలంటూ డిమాండ్ నోటీస్ వచ్చిందని తమకు రావాల్సిన బకాయి పోగా ఇంకా తాము సుమారు రూ.3.55 లక్షలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ మొత్తాన్ని కూడా చెల్లించేందుకు ప్రయత్నించామని మార్చినెలలో 15వ ఆర్థిక సంఘానికి సంబంధించిన సీఎఫ్ఎంఎస్ నుంచి చెల్లింపులు ముందుకు సాగని కారణంగా ఏప్రిల్‌లో అవుతుందని అధికారులు చెప్పారని అందుకే జాప్యం జరిగిందన్నారు. ఇదేమీ వినకుండా విద్యుత్ అధికారులు విద్యుత్ నిలిపివేయడం ఎంతవరకూ సమంజం అంటూ ప్రశ్నించారు.దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యదర్శి ఇలియాస్ బేగ్ మాట్లాడుతూ సొమ్ములు ట్రాన్స్‌ఫర్ కావడం లేదని చెప్పినా వినకుండా అధికారులు విద్యుత్ నిలిపివేశారన్నారు. దీనివల్ల కార్యాలయంలో పనులు ఏమీ జరగక చాలా ఇబ్బంది పడుతున్నామన్నారు. పింఛన్ అందించే సమ యంలో విద్యుత్ లేకపోవడం వల్ల లబ్ధిదారులు కూడా ఇబ్బంది పడతారన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు కాల్వలో పడి ఒకరి మృతి

భీమడోలు, ఏప్రిల్ 3 : భీమడోలు సమీపంలో ఏలూరు కాలువలో వ్యక్తి మృత దేహాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు గుర్తించారు. భీమడోలు జంక్షన్‌లో గ్యాస్ వెల్డింగ్ పనులు చే సుకుంటూ జీవనం గడుపుతున్న దొరి శ్రీను (50) అనే వ్యక్తి మంగళవారం భీమడోలు కనకదుర్గమ్మ గుడి సమీపంలో ఉన్న కాలువ రేవులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కాల్వలో పడ్డాడు. ఈ ప్రమాదంలో శ్రీను నీట మునిగి మృతి చెందాడు. బుధవారం మృతదేహం కాలువలో తేలుతుండగా స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లి, కుమారుడి అదృశ్యం

భీమవరం క్రైం, ఏప్రిల్ 3 : భీమవరం రెండో పట్టణానికి చెందిన పూర్ణిమ, ఆమె కుమారుడు సత్యకార్తిక్ ఆచూకీ ఈనెల 2 నుంచి లేదని పూర్ణిమ తండ్రి రాధాకృష్ణ ఫిర్యాదు చేశారని పోలీసులు చెప్పారు.భార్యా, భర్తల మధ్య మనస్పర్థలు కారణమని ఫిర్యాదులో పేర్కొనగా ఏఎస్ఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మంచినీరు అనుకుని యాసిడ్ తాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 : మంచినీరు అనుకుని యాసిడ్ తాగిన ఒక వృద్ధుడు విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొత్తూరు వంతెన పక్కన ఉన్న వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తూ అక్కడే ఉంటున్న కండిబోయిన పెద్దిరాజు (62) ఈనెల 1వ తేదీన ప్రమాదవశాత్తు మంచినీళ్లు అనుకుని యాసిడ్ తాగేశాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి విజయవాడలో పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

పెనుగొండ, ఏప్రిల్ 3: అప్పులు చేసి అవి తీర్చలేక ఆర్థిక సమస్యలతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెనుగొండ మండలం దొంగరావిపాలెంలో చోటు చేసుకుంది. పెనుగొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దొంగరావిపాలేనికి చెందిన కోన నరసింహమూర్తి (45) అప్పులు చేశాడు. అప్పులు తీర్చే దారిలేక, సమస్యలు ఎక్కువ అవడంతో గతనెల 29న పంట పొలాల్లో పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడటంతో కుటుంబ సభ్యులు తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. భార్య కోన లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెనుగొండ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్‌వీ రామారెడ్డి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ పగులకొట్టి కాపర్ వైరు చోరీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 : ట్రాన్స్‌ఫార్మర్ పగులకొట్టి దొంగలు అందులోని కాపర్‌వైరును దొంగిలించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపాడు మండలం వట్లూరు శివారులోని రైతు మురళీకృష్ణ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ పగలకొట్టి దొంగలు అందులోని కాపర్‌వైరు దొంగిలించారు. దీంతో పెదపాడు ఎలక్ట్రికల్ ఏఈ రాంబాబు ఫిర్యాదు మేరకు మంగళవారం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బంగారు గొలుసు చోరీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 : ఓ ప్రయాణికురాలి వద్ద బంగారు గొలుసు మాయమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ వాణీ నగర్‌కు చెందిన పులి శ్రీలక్ష్మి ఏలూరు సత్రంపాడులో ఉంటున్న తమ బంధువుల ఇంటికి వచ్చేందుకు సికింద్రాబాద్ నుంచి విజయవాడ వరకూ వచ్చింది. గత నెల 2వ తేదీన విజయవాడ నుంచి ఏలూరు వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం ఎక్కి సత్రంపాడులో దిగింది. బ్యాగులో ఉన్న పర్సు కనిపించలేదు. అందులో ఉన్న బంగారు గొలుసు పోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



పోడూరు మండలం జగన్నాథపురంలో రోడ్డు ప్రమాద దృశ్యం

లారీ ఢీకొని భార్య, భర్తలు మృతి

పోడూరు, ఏప్రిల్, 3 : లారీ ఢీకొట్టిన ప్రమాదంలో భార్యభర్తలు ఇద్దరూ మృతిచెందిన ఘటన బుధవారం పోడూరు మండలం జగన్నాథపురంలో జరిగింది. పోడూరు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పెనుగొండ మండలం కొఠాలపర్రు గ్రామానికి చెందిన ఇసురు మాదయ్య రెడ్డి (50), భార్య కృష్ణవేణి దంపతులు పాలకొల్లులోని ఒక వివాహ వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా జగన్నాథపురం రైస్‌మిల్లు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో కృష్ణవేణికి తలకు, శరీరానికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మాదయ్య రెడ్డిని 104 వాహనంలో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యం పొందుతూ మృతి చెందారు. మృతుడు పైపుల వ్యాపారం చేస్తుంటాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి వివాహాలు కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేసవి నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సెంట్రల్ క్రైం ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3: జిల్లాలో వేసవి కాలంలో జరిగే నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్‌వి మురళీకృష్ణ అన్నారు. డాబాలపై నిద్రించే వారు ఇళ్లకు తాళాలు వేయాలన్నారు. ఏసీ రూమ్‌లో పడుకునే సమయంలో, సెలవులకు బయటకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులు లాకర్‌లో భద్రపరుచుకోవాలన్నారు. అపార్టుమెంటులో వాచ్‌మెన్ తప్పనిసరిగా ఉండాలని, కొత్త వారు, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అపార్టుమెంటులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు బయటకు వెళ్లే సమయంలో ధరించే వస్తువులు, బ్యాగ్‌లు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. చైన్‌స్నాచింగ్‌లు ఉన్నాయని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రద్దీ ప్రాంతాలు, రైల్వే స్టేషన్లు, రైతు బజార్లు, షాపింగ్ మాల్స్, బ్యాంక్‌ల వద్ద ఫోన్లు అపహరిస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలకు అలారమ్, డబుల్ లాక్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. రహదారుల వెంబడి అపరిచితులు లిఫ్ట్ అడిగి నేరాలకు పాల్పడుతున్నారని, వాహనదారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆటోలో మహిళలు హ్యాండ్ బ్యాగ్, సామగ్రి భద్రంగా చూసుకోవాలన్నారు. వేసవి సెలవులకు ఊర్లు వెళ్ళే వారు పోలీస్ శాఖ ఉచితంగా అందిస్తున్న ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ముఖ్య సమాచారం ఉంటే సమీప పోలీస్ స్టేషన్, ఏలూరు క్రైమ్ స్టేషన్ 08812- 223318కు సమాచారం అందించాలని మురళీకృష్ణ సూచించారు.


తాడిచర్లలో పథకాలు వివరిస్తున్న టీడీపీ శ్రేణులు


పెదవేగిలో భవిష్యత్ గ్యారంటీ పత్రాలను అందిస్తున్న సర్పంచ్

ప్రజలు బటన్ నొక్కితే
వైసీపీ ఇంటికే..
జగన్ పాలనలో అన్నివర్గాలకు నష్టం
కూటమిని గెలిపించాలని టీడీపీ శ్రేణుల ప్రచారం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 3: రాష్ట్రంలో అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి బటన్ నొక్కేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఏలూరు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. 26వ డివిజన్‌లో బుధవారం ప్రజా సంకల్పయాత్రలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. చంటి మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు జగన్‌చెప్పిన మాయమాటలు నమ్మి జనం మోస పోయారని, ఇప్పుడు వాస్తవాలు తెలుసుకుని జగన్ నిజస్వరూపం ప్రజలకు అర్థమవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో బుద్ధిచెప్పాలని ప్రజాసంక్షేమాన్ని కాంక్షించే ఆ కూటమికి విజయం చేకూర్చాలని ఆయన కోరారు. పార్టీ నగర అధ్యక్షుడు టి.శివప్రసాద్, జనసేన నగర అధ్యక్షుడు ఎన్.కాశీనరేష్, రెడ్డిగౌరీశంకర్, వీరంకి పండు, గూడవల్లి వాసు, చేకూరి గణేష్, మాజీ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాలరావు, సోమిశెట్టి రామ్మోహన్ రావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం అమ్మించారు.. పింఛన్లు ఇవ్వలేరా : పుట్టా

ఏలూరు రూరల్: జే బ్రాండ్ మద్యం అమ్మకాల కోసం మద్యం దుకాణాల వద్ద టీచర్లు, వీఆర్వోలను నిలబెట్టిన సైకో జగన్ పింఛన్ల పంపిణీకి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, బడేటి చంటి, జనసేన ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. 48వ డివిజన్ మెట్లకోనేరు వద్ద వినాయక స్వామిగుడి వద్ద నిర్వహించిన ప్రజాగళం సభలో వారు పాల్గొన్నారు. కుట్రపూరితంగా వైసీపీ ప్రభుత్వం పెన్షన్లు జాప్యం చేసి, ప్రతిపక్షాలపై నిందలు వేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవ్వాతాతలకు ఇవ్వాల్సిన పెన్షన్ సొమ్మును తమ తాబేదారులకు దొడ్డిదారిన పంచిపెట్టిన జగన్మోహన్‌రెడ్డి ఖజానా మొత్తాన్ని ఊడ్చేసి, ఎన్నికలకు ముందు గ్లోబెల్స్ ప్రచారానికి తెరలేపారని వారు మండిపడ్డారు. సచివాలయ సిబ్బంది, సెర్ప్ సిబ్బంది, వీఆర్వోలతో పెన్షన్ల పంపిణీకి ఎందుకు చర్యలు తీసుకోలేదో సమాధానం చెప్పాలన్నారు. వందనాల శ్రీనివాసరావు, ఆర్నేపల్లి తిరుపతిరావు, సరిది కృష్ణవేణి, మాగంటి హేమసుందర్, జనసేన పార్టీ


ప్రజాగళం సభలో మహేష్‌యాదవ్, బడేటి చంటి, అప్పలనాయుడు

నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

తాడిచర్లలో టీడీపీ శంఖారావం

కామవరపుకోట: ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ బుధవారం తాడిచర్లలో సర్పంచ్ పార్థసారథిబాబు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నేతలు వేముల హనుమంతు, బొర్రా రాంబాబు, గుల్లా నాగేశ్వరరావు, యలమర్తి శ్రీనివాసరావు, వెలిశెట్టి బాల మురళి, గంగుల పోతురాజు, తోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు..


టి.నరసాపురం శివాలయంలో పూజలు చేస్తున్న బాలరాజు, నేతలు

ఎన్నికల్లో విజయఢంకా మోగిస్తాం

టి.నరసాపురం: సార్వత్రిక ఎన్నికల్లో విజయ ఢంకా మోగిస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు అన్నారు. మండలంలో ఎన్నికల ప్రచారం కొనసాగించారు. ముందుగా శివాలయంలో పార్టీ నాయకులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు మహిళలు కూటమి వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలరాజు నియోజకవర్గానికి ఏమీ చేయలేదన్నారు. ఆయన ఓడిపోతారని తెలిసి ఆయన భార్యను ఎన్నికల్లో నిలబెడుతున్నాడని చిర్రి బాలరాజు అన్నారు. ఎవరు పోటీలో ఉన్నా తన గెలుపు ఖాయమని, గెలవకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు. కూటమి అధికారంలోకి వస్తే 50 ఏళ్లు దాటిన వారికి రూ.4వేలు పింఛను, మూడు గ్యాస్ బండలు ఉచితం వంటి సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. జనసేన నాయకులు అడపా నాగరాజు, మద్యాహ్నపు పెంటారావు, జట్లా సత్యనారాయణ, పూనెం ఆదిత్య, మాండ్రు రాంబాబు, నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్

పెదవేగి: అప్పుల ఆంధ్రాగా మారిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి దిశగా నడిపించాలంటే టీడీపీతోనే సాధ్యమని పెదవేగి సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి అన్నారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి ఇంటింటికి తిరిగి భవిష్యత్ గ్యారంటీ కరపత్రాలను అందించారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనే రాష్ట్రం సుభిక్షంగా, ప్రశాంతంగా ఉందని, వైసీపీ పాలనలో రాష్ట్రం రావణకాష్టంగా మారిందని, టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో ప్రశాంతత నెలకొంటుందన్నారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌ను గెలిపించాలని ఆయన కోరారు. పార్టీ నాయకులు తాతా సత్యనారాయణ, కంచెన మోహనరావు, సుబ్బారావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు పనులు నూరు శాతం పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సోమశేఖర్

పెదపాడు, ఏప్రిల్ 3: నాడు-నేడు పనులను నూరు శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఆయా ఖాతాల్లో నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ వి.సోమేశేఖర్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎన్నికల నిబంధనలను విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. ఎస్ఏ 2 పరీక్షల కోసం విద్యార్థులను సమయాత్తం చేయాలన్నారు. ఎన్నికల కోసం అన్ని పాఠశాలలను సిద్ధంగా ఉంచాలని ఎంపీడీవో తేజరతన్ ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో నరసింహమూర్తి, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కోలాటం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌లు


శిక్షణ ముగింపు సభలో ప్రిన్సిపాల్ ప్రసాద్

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 3: ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జానపద కళారూపం కోలాటం శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. 41 మంది విద్యార్థులు కోలాటంపై శిక్షణ పొందారు. విద్యార్థులకు శిక్షణతో పాటు, కోలాటం పాటలు, వీడియోలు, ప్రదర్శనలతో అవగాహన కల్పించిన నిర్వాహకుడు తెలుగు శాఖ అధ్యక్షుడు జి.వెంకటలాల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్‌బాబు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యు ఏసి కోఆర్డినేటర్ ఎం.మధు, అధ్యాపకులు సీహెచ్ బద్రినారాయణ, అనిల్ పాల్గొన్నారు.

సీతారాముల తలంబ్రాలు సిద్ధం


గోటితో ఒలిచిన ధాన్యం గింజలు

ఉంగుటూరు, ఏప్రిల్ 3: కైకరం తూర్పు వీధి సుందర సీతారామ స్వామి ఆలయంలో శ్రీరామనవమికి సీతారాముల కల్యాణానికి తలంబ్రాలను భక్తులు సిద్ధం చేశారు. కొత్త ధాన్యం తెచ్చి గోటితో ఒలిచిన బియ్యాన్ని ప్యాకెట్లుగా సిద్ధం చేశారు. 108 ప్యాకెట్లలో మొత్తం 1,08,864 గింజలను సిద్ధం చేశారు. వీటిని స్వామి వారి కల్యాణంలో ఉపయోగించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు కూనా అప్పారావు తెలిపారు.

పోలవరంలో నగరేశ్వరస్వామికి పూజలు

పోలవరం, ఏప్రిల్ 3: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నగరేశ్వర స్వామి లింగ ప్రతిష్ఠ సందర్భంగా బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నగరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు పైడిపల్లి ఫణికుమార్ శర్మ, అల్లవరపు సుబ్రహ్మణ్యం పూజలు చేయించారు. గురువారం కూడా ప్రత్యేక పూజల అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమాలు ఉంటాయని ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలియజేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 3: శనివారపుపేట హైస్కూల్‌రోడ్డు గంగానమ్మగుడి వద్ద సీతారామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 5న ఆలయ ప్రాంగణంలో సీతారామలక్ష్మణ హనుమాన్ విగ్రహాల ప్రతిష్ఠ, అన్నసమారాధన నిర్వహించనున్నారు.

ద్వారకా తిరుమల వెంకన్న సేవలో విదేశీ భక్తుడు


స్వామివారి వాహనాన్ని మోస్తున్న విదేశీ భక్తుడు

ద్వారకా తిరుమల, ఏప్రిల్ 3: ద్వారకా తిరుమల ఆలయంలో ఓ విదేశీయుడు శ్రీవారి వాహనాన్ని భుజాలపై మోసి తన భక్తి ప్రపత్తులను చాటుకున్నాడు. వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం ఓ విదేశీ భక్తుడు సందర్శించాడు. ఈ సమయంలో నిత్యార్జిత కల్యాణానికి ఉభయదేవేరులతో కల్యాణ మండ పానికి తరలివెళ్తున్న శ్రీవారి వాహనాన్ని మోస్తానని అడగడంతో అతనికి చోటిచ్చారు. స్వామి వారి వాహన సేవలో ఆనందం పొందిన అతడు తన వివరాలను చెప్పేందుకు ఇష్టపడలేదు.


కలపర్రు చెక్‌పోస్ట్‌లో వాహనాల తనిఖీ పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి



వాహనాల తనిఖీ అధికారులకు సూచనలిస్తున్న జేసీ లావణ్యవేణి

ప్రతి వాహనం క్షుణ్ణంగా తనిఖీ చేయాలి : జేసీ

పెదపాడు, ఏప్రిల్ 3: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని దెందులూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అధికారులకు, పోలీసులకు సూచించారు. జాతీయ రహదారిపై కలపర్రు టోల్‌గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జేసీ లావణ్యవేణి బుధవారం తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో జిల్లా సరిహద్దులతో పాటు ముఖ్యప్రాంతాల్లో విస్తృత తనఖీలు నిర్వహించాలన్నారు.

కలపర్రు వద్ద ఎన్నికల చెక్‌పోస్టును ఎస్పీ మేరీ ప్రశాంతి పరిశీలించారు. జాతీయరహదారిపై వాహనాలను అధికారులు తనిఖీ చేసే విధానాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. తనిఖీలకు వాహనదారులు, వాహన యజమానులు పోలీసు, అధికారులకు తగిన విధంగా సహకరించాలని కోరారు. నగదు, ఇతర వస్తువుల రవాణాలో వాటికి సంబంధించి పూర్తి ఆధారాలు చూపాల్సి ఉంటుందని, ఎన్నికల నిబంధనల కంటే అధికంగా నగదును తరలిస్తే వాటిని స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. తనిఖీల్లో తహసీల్దారు భావన్నారాయణ, ఎంపీడీవో తేజరతన్, ఎస్సై శుభశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దళిత వ్యవసాయ కార్మికులను విడుదల చేయాలి

టి.నరసాపురం, ఏప్రిల్ 3: అల్లంచర్ల రాజుపాలెంలో అదుపులోకి తీసుకున్న దళిత వ్యవసాయ కార్మికులను ఫారెస్ట్ అధికారులు వెంటనే విడుదల చేయాలని సీపీఐ నేత టీవీఎస్ రాజు బుధవారం డిమాండ్ చేశారు. అల్లంచర్లరాజుపాలెంలో వందల ఎకరాల అటవీ భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటున్న పెత్తందారుల జోలికి వెళ్లకుండా కూలి పనికి వెళ్లిన కొండగూడెంకి చెందిన కూలీలను అదుపులోకి తీసుకోడాన్ని ఆయన ఖండించారు. అటవీ భూములను సొంత భూముల మాదిరిగా క్రయవిక్రయాలు సాగిస్తున్న దళారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదుపులోకి తీసుకున్న దళిత వ్యవసాయ కార్మికులను వెంటనే విడుదల చేయాలని అటవీశాఖ అధికారులను ఆయన డిమాండ్ చేశారు.

వైసీపీ కార్యకర్తల కుమ్ములాట

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 3 : వైసీపీ కార్యకర్తలు కుమ్ములాడుకున్నారు. జంగారెడ్డిగూడెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం వైసీపీ బూత్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. అక్కడ పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ గారపాటి రాధాకృష్ణ, చింతలపూడి ఏఎంసీ వైస్ చైర్మన్ తాతకుంట్ల రవికుమార్ మధ్య ఘర్షణ జరిగింది. ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాకు కోవర్టుగా పని చేస్తున్నావంటూ రవికుమార్‌పై రాధాకృష్ణ ఆరోపణలు చేయడంతో గొడవ మొదలైనట్టు తెలుస్తోంది. ఇద్దరు పెద్దపెద్ద కేకలతో బాహాబాహీ తలపడినట్టు కొందరు చెబుతున్నారు. రాధాకృష్ణ రవికుమార్‌పై చెంప దెబ్బ కొట్టినట్టు చెబుతున్నారు. ఇరువురూ కలబడి కొట్లాటకు దిగడంతో పక్కనున్న నాయకులు అడ్డుకున్నట్లు సమాచారం.

వైద్యం అందక పశువుల మృత్యువాత

బుట్టాయగూడెం, ఏప్రిల్ 3: పశు వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వైద్యం అందక పశువులు మృత్యువాత పడుతున్నాయని కేవీపీఎస్ జిల్లా నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్ తెలిపారు. రెడ్డిగణపవరంలో ఇటీవల కాలంలో గేదె దూడలు చనిపోయినట్లు తెలిపారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వికార్ జనరల్ ఫాదర్ బాలకు సత్కారం


ఫాదర్ బాలను సత్కరిస్తున్న జాన్ వెస్లీ

దెందులూరు, ఏప్రిల్ 3: ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ పి. బాలను బుధవారం సోమవరపాడు సెయింట్ జాన్స్ విద్యాసంస్థల్లో ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ సత్కరించారు. ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేసి ఫాదర్ బాల నుంచి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఫాదర్ బాల కార్పొరేషన్ చైర్మన్‌ను ఆశీర్వదించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఘనంగా గురు పట్టాభిషేక వార్షికోత్సవం

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 3: ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు గురు పట్టాభిషేక వార్షికోత్సవం కెథడ్రల్ చర్చి ఆవరణలో బుధవారం నిర్వహించారు. విశ్వాసులు, ఫాదర్లు జయరావుకు ఘన స్వాగతం పలికారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కొట్టారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ తదితరులు హాజరై అభినందనలు తెలిపారు. అనంతరం వికార్ జనరల్ పి.బాల, ఫాదర్ జార్జ్, మైకేల్, బేదంపూడి రాజు, ఫాదర్ మోజేస్, జాలిపూడి తదితరులు జయరావును సత్కరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

బుట్టాయగూడెం, ఏప్రిల్ 3: పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అభ్యర్థి సరియం రామ్మోహన్, కారం రాఘవ అన్నారు. మంగయ్యపాలెంలో బుధవారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన ఉండి ఉద్యమాలు చేసినట్లు తెలిపారు. రామ్మోహన్‌కు అండగా ఉండాలన్నారు. వి.భారతి, కె.పోతురెడ్డి, కూరం చినకన్నయ్య, బి.వినోద్, కె.రాముడు, డి.మారయ్య, కె.వెంకటేష్, ఎం.దుర్గ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షుడు గోవిందరావు

వైసీపీ నుంచి 200 మంది జనసేన పార్టీలో చేరిక

భీమడోలు, ఏప్రిల్ 3: గుండుగొలను గ్రామానికి చెందిన వైసీపీ కీలక నేతలు 200 మంది జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ నేతలు వగ్గాల భాస్కరరావు, కాశీబాబు, బోడా దేవవరమ్మతో పాటు 200 మంది జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జి.రవి సమక్షంలో ఉంగుటూరు అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో బుధవారం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర భవిష్యత్ కోసం జనసేన, టీడీపీ, బీజేపీ కూటమికి ఎంతో ప్రజాదరణ లభిస్తుందని రాష్ట్రానికి మంచి రోజులు రావాలంటే నరేంద్రమోదీ, చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ నాయకత్వం అవసరమని పలువురు నేతలు అన్నారు. కార్యక్రమంలో ప్రత్తి మదన్, శిరిబత్తిన కొండబాబు, ఉప్పాల శ్రీనివాస్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
దెందులూరు కాంగ్రెస్ అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తి



పెదవేగి, ఏప్రిల్ 3: దెందులూరు కాంగ్రెస్‌పార్టీకి పెట్టనికోట అని, కాంగ్రెస్ పార్టీ విజయానికి కలసికట్టుగా కృషి చేయాలని పార్టీ అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తి అన్నారు. ముండూరులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి తిరిగి పూర్వ వైభవం తీసుకురావడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త కష్టించి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌పార్టీకి పూర్వంనుంచి ఓటర్లు అలాగే ఉన్నారని, వారిని నడిపించే నాయకుడు లేకపోవడంతో స్తబ్దతగా ఉన్నారని, ఇప్పుడు ఏపీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల వచ్చిన తరువాత కాంగ్రెస్‌పార్టీకి నూతనోత్తేజం వచ్చిందని, ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో ప్రభంజనం సృష్టిస్తామని ఆయన అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకొస్తామని, దీనికోసం ప్రతికార్యకర్త కృషి, చేయాలని కోరారు.

ప్రభుత్వ వ్యతిరేక ఓట్లపై దృష్టి పెట్టాలి : ఎలీజా

చింతలపూడి, ఏప్రిల్ 3: ప్రభుత్వ వ్యతిరేక ఓట్లపై దృష్టిపెట్టాలని కాంగ్రెస్ కార్యకర్తలకు అభ్యర్థి ఉన్నమట్ల ఎలీజా సూచించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సమావేశంలో ఎలీజా మాట్లాడుతూ కాంగ్రెస్‌కు అభిమానులు చాలామంది ఉన్నారని, పార్టీని బలోపేతం చేయడానికి ప్రతిఒక్క ఓటు కాంగ్రెస్‌కు పడేవిధంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లపై దృష్టిపెట్టాలన్నారు. కార్యకర్తల అభిప్రాయాలు కూడా సమావేశంలో తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, మండలశాఖ అధ్యక్షులు వి.సుందర్‌రావు, బోసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టా మహేష్ యాదవ్, గన్ని పూజలు

ఉంగుటూరు, ఏప్రిల్ 3: ఉంగుటూరు మండలం వెల్లమిల్లిలో బుధవారం సీతారామస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. టీడీపీ కూటమి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు దండమూడి దుర్గారావు, తాతిన గోపి, బండి స్వరూప్, యర్రా మునలయ్య దంపతులు, పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 3: అందరూ ఎన్నికల నియమావళి పాటించాలని రిటర్నింగ్ అధికారి ఖాజావలి సూచించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. సామాజిక మాధ్యమాలలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనన్నారు. అనుమతిలేని పెయిడ్ ఆర్టికల్స్‌ను ప్రచురిస్తే నిబంధనల ప్రకారం ఖర్చును లెక్కిస్తారన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నంత వరకు నగదు రూ.50 వేలకు మించి తీసుకువెళ్లవద్దని సూచించారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ ప్రత్యూష, సీఐలు బీటీ.రవి కుమార్, ఎంవీ.సుభాష్, ఉంగుటూరు, భీమడోలు, గణపవరం తహసీల్దార్లు కే.వెంకట శివయ్య, వరహాలరావు, రాంబాబు, పోసిబాబు పాల్గొన్నారు.


ఏలూరులో వేచివున్న పింఛన్‌దారులు


పోలవరం సచివాలయంలో వేచివున్న లబ్ధిదారులు


ఉంగుటూరులో పెన్షన్‌దారుల పడిగాపులు


జీలుగుమిల్లిలో పెన్షన్ కోసం వృద్ధుల ఎదురుచూపు

పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం విఫలం
పింఛన్ ఆలస్యంపై మండిపడుతున్న వృద్ధులు
టీడీపీపై నింద మోపుతున్న వైసీపీ నాయకులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 3: ఎన్నికల వేళ జగన్ పింఛన్ డ్రామాకు తెరతీశారు. పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం విఫలం కావడంతో వలంటీర్లు పింఛన్లు పంచరాదన్న ఎన్నికల కమిషన్ నిర్ణయానికి కారణం టీడీపీ అంటూ నింద మోపుతున్నారు. స్థానిక గన్‌బజార్ నూకాలమ్మ ఆలయం సమీపంలోని సచివాలయంలో బుధవారం పంపిణీ ప్రారంభించగా సాక్షి ఛానెల్ ప్రత్యక్ష ప్రసారమిస్తూ వైసీపీ నాయకుడు మేతర సురేష్‌బాబు సహకారంతో పింఛన్ దారులను పక్కకు తీసుకెళ్లి పింఛన్ల ఆలస్యానికి చంద్రబాబే కారణమని మాట్లాడించారు. ఇదే సమయంలో మేతర అజయ్ అనే టీడీపీ కార్యకర్త చేరుకుని వైసీపీ ప్రభుత్వమే కారణమని, నిధులు లేక పంపిణీ ఆలస్యం చేసిందన్నారు. వాగ్వాదం జరగడంతో సచివాలయ ఉద్యోగులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ ఎం.ప్రభాకర్, ఎస్ఐలు బాషా, సాదిక్, రవితేజ వచ్చి విషయం ఆరా తీశారు. ఇదే సమయంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ ఫొటోలు తీస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. సాక్షి ఛానెల్ సిబ్బంది సచివాలయం వద్దే ఉండి ప్రత్యక్ష ప్రసారం ఇస్తున్నారు కదా అని ప్రశ్నిస్తే సాక్షికి ఛానెల్‌కు మాత్రమే అనుమతి ఉందంటూ పోలీసులు చెప్పడం గమనార్హం. ఏలూరు రూరల్ మండలంలో సాయంత్రం 4 గంటల వరకు పింఛన్ డబ్బులు అందించకపోవడంతో లబ్ధిదారులు సచివాలయాల వద్దే వేచి ఉన్నారు. సుంకరివారితోట సచివాలయం వద్ద ఉదయం 8 గంటలకు వచ్చిన పింఛన్‌దారులు మధ్యాహ్నం వరకు ఇవ్వకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. శనివారపుపేట సచివాలయం -1లో సాయంత్రం ఐదు గంటలు దాటినా పింఛన్లు ఇవ్వకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు.

● జంగారెడ్డిగూడెం : పెన్షన్ కోసం లబ్ధిదారులు ఉదయమే సచివాలయాల వద్దకు చేరుకోగా నగదు లేకపోవడంతో మధ్యాహ్నం 3 గంటల తర్వాత పట్టణంలో పెన్షన్ల పంపిణీ ప్రారంభించారు. మండలంలో 19 సచివాలయాల పరిధిలో 8957పెన్షన్‌లు ఉండగా 62 శాతంతో 5538 పెన్షన్ల సొమ్ములను పంపిణీ చసినట్టు ఎంపీడీవో కె.ప్రసాద్ తెలిపారు. అలాగే జంగారెడ్డిగూడెం మున్సిపల్ పరిధిలో 10 సచివాలయాల పరిధిలో 4962 పెన్షన్‌దారులకు గాను 55 శాతంతో 2700 మందికి పెన్షన్ సొమ్ములను అందించారు.

చింతలపూడి : చింతలపూడి, కామవరపుకోట మండలాల్లో మధ్యాహ్నం 3 గంటలు దాటిన తర్వాత పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. చింతలపూడి ఎంపీడీవో నాగరాటాలు ప్రశ్నించగా బ్యాంకుల్లో నగదు డ్రాచేసి మండలంలోని 21 సచివాలయాలకు పంపించామని తొలిరోజు రాత్రి 9 గంటల వరకు, గురువారం నుంచి ఉదయం 9 గంటలకే తిరిగి పంపిణీ చేస్తామన్నారు. బోయగూడెం సచివాల యంలో ఎన్నికల అధికారులు పెన్షన్ పంపిణీ తీరును పరిశీలించారు.

పింఛన్ల పంపిణీలో రాజకీయ వివాదం

జంగారెడ్డిగూడెం: మండలంలోని ఎ.పోలవరం గ్రామ సచివాలయం వద్ద పెన్షన్‌ల పంపిణీలో వివాదం చోటు చేసుకుంది. సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తుండగా జి.నాగార్జున అనే వ్యక్తి సచివాలయ ఆవరణలో కొంత మంది వృద్ధులతో మాట్లాడి వీడియో తీయడాన్ని గ్రామస్తులు గుర్తించారు. వలంటీర్ల ద్వారా పింఛన్లు ఇవ్వకుండా ప్రతిపక్షాలు పెన్షన్‌దారులపై కక్ష పన్నారని, మరోసారి కూడా వైసీపీ ప్రభుత్వం వస్తే పెన్షన్‌దారులందరికీ వలంటీర్లు ఇళ్ల వద్దకే పెన్షన్‌లు తీసుకువచ్చి అందిస్తారని అక్కడున్న వృద్ధులతో చెప్పించి వీడియో తీస్తున్నారని గ్రామస్థులు గమనించి అక్కడున్న సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే సెక్రటరీ పద్మశ్రీ, సచివాలయ సిబ్బంది సదరు నాగార్జున వద్ద నుంచి మొబైల్ ఫోన్ తీసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లింగపాలెం: మండలంలో సాయంత్రం 6 గంటల తర్వాత పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. సాయంత్రం 5.30 వరకు పెన్షన్ నగదు రాకపోవడంతో ఆలస్యంగా ప్రారంభించారు. దీనిపై ఎంపీడీవో రాంబాబు మాట్లాడుతూ సాయంత్రం 5.30 వరకు పంచాయతీ ఖాతాల్లో నిధులు జమ కాలేదన్నారు.

● పెదపాడు : మండలంలో బుధవారం రాత్రి 8 గంటల సమయానికి 6,530 పెన్షన్లను పంపిణీ చేసినట్లు ఈవోపీఆర్డీ సూర్యకుమార్ తెలిపారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి పెన్షన్లను అందిస్తామన్నారు.

● జీలుగుమిల్లి : మండలంలో బుధవారం సాయంత్రం 6 గంటల వరకు పింఛన్లు పంపిణీ జరగలేదు. ఉదయం నుంచి ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద వృద్ధులు ఎదురు చూశారు. ఎంపీడీవో కె.ఎం.మంగతాయారును ప్రశ్నించగా బ్యాంకు వద్ద నగదు డ్రా చేయడంలో జాప్యం జరిగినట్టు చెప్పారు.

● భీమడోలు: మండలంలో సాయంత్రం 4 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. సుమారు 9 వేల మంది పింఛన్‌దారులకు రెండు వేలపై చిలుకు వరకూ బుధవారం సాయంత్రానికి పంపిణీ చేశామని మిగిలిన పింఛన్లు కూడా పంపిణీ చేస్తామని ఎంపీడీవో స్వర్ణలత తెలిపారు.

● పెదవేగి : సామాజిక పింఛన్ల పంపిణీ బుధవారం మధ్యాహ్నం నుంచి ఆయా గ్రామాల సచివాలయాల దగ్గర పంపిణీ చేశారు. సాయంత్రం 6గంటల వరకు సచివాలయాల దగ్గర పంపిణీ చేసిన అనంతరం ఆరుగంటల నుంచి నడవలేని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి, పింఛన్లను అందించారు.

● ఉంగుటూరు : మండలంలో 11,800 లబ్ధిదారులు పడిగాపులు కాశారు. ఉంగుటూరు, బాదంపూడి, చేబ్రోలులో మధ్యాహ్నానికి పంపిణీ మొదలు పెట్టారు. సాయంత్రం 5 గంటల తర్వాత రెండు సచివాలయాల్లో పంపిణీ మొదలు పెట్టారు. మండలంలో తొలి రోజు సుమారు వెయ్యి మందికి పంపిణీ జరిగింది.

● కామవరపుకోట: ఎన్నికల కోడ్ నేపథ్యంలో సచివాలయాల వద్ద పెన్షన్లు అందజేస్తారని ఆశ పడి వెళ్లిన వారికి నిరాశే ఎదురైంది. డబ్బు రాలేదని సాయంత్రం అందజేస్తామని సచివాలయ ఉద్యోగులు చెప్పడంతో ఇంటిముఖం పట్టారు. సాయంత్రం పంపిణీ చేయడంతో కొందరు మాత్రమే తీసుకున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు క్రైం :** ఒక ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా పేకాడుతున్న 12 మందిని టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కప్పగంతుల వారి వీధిలోని ఇంట్లో పేకాడుతున్నారని సమాచారం అందుకున్న సీఐ ప్రభాకర్ ఆదేశాలతో పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. 12 మందిని అరెస్ట్ చేసి రూ 41,100 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసీమియా భవనంలో 10 మంది తలసీమియా చిన్నారులకు బుధవారం రక్తమార్పిడి నిర్వహించినట్లు బీవీ కృష్ణారెడ్డి తెలిపారు.
- **జంగారెడ్డిగూడెం :** ఎండలు తీవ్రంగా ఉండటంతో విద్యార్థులు, చిన్నపిల్లలు జాగ్రత్తలు వహించాలని తాడువాయి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆర్.నాగదుర్గారావు అన్నారు. బుధవారం స్కూల్‌లో వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.
- ఇంజనీర్స్ సిండికేట్ నిర్వహించినజనరల్ నాలెడ్జ్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ స్కూల్ విద్యార్థులు రాష్ట్రసాథయి ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. తన్విష్, ద్వితీయ, వైవర్షిత్ రాజ్ తృతీయ స్థానం సాధించారు.
- **బుట్టాయగూడెం :** వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇంటివద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు కారం రాఘవ డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా ఇంటింటికీ పింఛన్లు ఇవ్వకపోవడంతో పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పింఛన్.. పాట్లు

గంటల కొద్దీ పడిగాపులు ▸ ఎండలో వృద్ధుల వెతలు


మట్టగుంటలో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు


ముసునూరు సచివాలయం వద్ద లబ్ధిదారులు


అన్నవరం గ్రామం వద్ద పింఛన్ల కోసం వేచి చూస్తున్న వృద్ధులు

పింఛన్ల పంపిణీకి సకాలంలో నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కోడ్ అమలును, ఆర్థిక సంవత్సరం ముగింపును దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాల్సి ఉండగా చివరివరకు చర్యలు చేపట్టక పోవడంతో ఎండలో పింఛన్‌దార్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నూజివీడు/టౌన్: పింఛన్ల సొమ్ము కోసం సచివాలయ ఉద్యోగులు నూజివీడు పట్టణం, మండల గ్రామాల్లోని బ్యాంకుల్లో బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. రాత్రి 7 గంటల వరకు చేతికి అందిన నగదును పంపిణీ చేయాలని, మరో మూడురోజుల పాటు ఈ పింఛన్లు పంపిణీ చేయవచ్చని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. నియోజకవర్గంలో నూజివీడు మున్సిపల్ పరిధితో పాటు నూజివీడు మండలం ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల పరిధిలో మొత్తం 91 సచివాలయాలు ఉండగా, 46,257మంది పెన్షనర్లున్నారు. బుధవారం సాయంత్రం నాటికి వీరిలో 10 శాతం మందికి మాత్రమే పింఛన్ నిధులు విడుదల కావడంతో సచివాలయ ఉద్యోగులు ఆయా గ్రామ సచివాలయాల్లో పింఛన్‌లను పంపిణీకి ఉపక్రమించారు.

ముసునూరు : మండలవ్యాప్తంగా ఉన్న సచివాలయాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు పడ్డారు. సాయంత్రం 5 గంటల తర్వాత పంపిణీ ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 8,053 మంది పెన్షన్‌దారులు ఉండగా సగం మందికి మాత్రమే నగదు అందింది. ఒకటో తేదీన ఇవ్వాల్సిన పెన్షన్ నగదు మూడో తేదీన ఇవ్వడంతో ప్రభుత్వ పనితీరుపై పెన్షన్‌దారులు అసహనం వ్యక్తం చేశారు.

ఆగిరిపల్లి : మండలంలో సాయంత్రం 4 గంటల నుంచి సచివాలయాల్లో పింఛన్ల సొమ్ము అందజేశారు. మండల పరిధిలో 9,953 మంది లబ్ధిదారులు ఉండగా, 19 సచివాలయాల్లో సెక్రటరీల ద్వారా పంపిణీ చేస్తున్నట్టు ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు.

మండవల్లి : మండలంలోని 14 సచివాలయాల్లో మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. రాత్రి వరకు పంపిణీ చేసినా పూర్తవ్వలేదు. మిగిలిన వారికి గురువారం రమ్మని పంపించివేశారు.

చాట్రాయి : మండలంలో ఎక్కువ గ్రామాల్లో పింఛన్ల పంపిణీ సాయంత్రం ఐదు గంటల తర్వాత ప్రారంభించగా చనుబండ-1, 2, కోటపాడు, చీపురు గూడెం సచివాలయాల్లో మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమైంది.

కైకలూరు : మండలంలో అధిక శాతం గ్రామాల్లో సాయంత్రం 4 గంటల తర్వాత, కొన్ని గ్రామాల్లో సాయంత్రం 6 గంటల తర్వాత పెన్షన్ల పంపిణీ చేశారు. అప్పటి వరకు పెన్షన్ ఎప్పుడు అందుతుందో తెలియక లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. ఇంటి వద్ద మంచాన పడి ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు గురువారం వారి ఇంటి వద్దే సచివాలయ సిబ్బంది పెన్షన్లు అందజేస్తారని ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు తెలిపారు.

కలిదిండి : మండలంలో సాయంత్రం 5 గంటల వరకు పింఛన్ల పంపిణీ ప్రారంభం కాలేదు. దీంతో సచివాలయాల వద్ద వృద్ధులు, దివ్యాంగులు పలు అవస్థలు పడ్డారు. మండలంలో మొత్తం 9,515 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి రూ.2 కోట్ల 90 లక్షల 11 వేల నగదు పంపిణీ చేయాల్సి ఉంది. కలిదిండి యూనియన్ బ్యాంక్‌లో బుధవారం రూ.76 లక్షలు క్రెడిట్ అయినా బ్యాంక్‌లో సర్వర్ పని చేయక నగదు ఎంపీడీవో దినతేజ్ తెలిపారు.

ముదినేపల్లి : మండుటెండలో పెన్షనర్లు ఇబ్బందులు పడ్డారు. సచివాలయాల సిబ్బంది సొమ్మును బ్యాంకుల నుంచి డ్రా చేసి మధ్యాహ్నం 3 గంటల నుంచి పంపిణీ ప్రారంభించారు. మండలంలో 9126 మంది పెన్షనర్లకు రూ.2.60 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, సుమారు 30 శాతం మంది పెన్షనర్లకు పెన్షన్‌లను పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. తహసీల్దార్ ఎస్.లక్ష్మీ నరసకుమారి, ఎంపీడీవో మురళీ గంగాధరరావు, ఈవోపీఆర్డీ లక్ష్మీ నారాయణ పెన్షన్ల పంపిణీని పర్యవేక్షించారు.


మాట్లాడుతున్న జయమంగళ.. చిత్రంలో వైసీపీ అభ్యర్థి డీఎన్నార్

కొల్లేరు సమస్యలు వదిలి..
సొంత డబ్బా!

▸ కొల్లేరు ఆత్మీయ సమావేశంలో హామీలివ్వని వైసీపీ అభ్యర్థులు
▸ ఆద్యంతం కామినేనిపై విమర్శలే

కైకలూరు, ఏప్రిల్ 3: కొల్లేరు ప్రజల ఆత్మీయ సమావేశం పేరిట వైసీపీ నాయకులు బుధవారం రాత్రి నిర్వహించిన సభలో కొల్లేరు ప్రజలకు ఎలాంటి హామీలు దక్కలేదు. కైకలూరులో వైసీపీ నాయకులు బుధవారం కొల్లేరు ప్రజల ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో కొల్లేరు ప్రజలకు ఎలాంటి హామీలు నేతలు ఇవ్వకపోవటంతో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యమంత్రి ఇచ్చే హామీని సైతం ఎమ్మెల్యేనే నేరుగా ఎమ్మెల్సీ జయమంగళను మంత్రిని చేస్తామనడం సభలో చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రి స్థాయిలో ఇచ్చే హామీని ఎమ్మెల్యే ఎలా ఇస్తారంటూ ప్రజలు చెవులు కొరుక్కున్నారు. ఎమ్మెల్యేగా దూలం నాగేశ్వరరావు గెలిస్తే జయమంగళకు మంత్రి పదవి రానిస్తారా అనేది చర్చగా మారింది. జయమంగళ వెంకటరమణకు ఎమ్మెల్సీ పదవి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో జయమంగళ చెప్పిన పనులు సైతం జరగనీయకుండా అడ్డుకున్న నేతలు మంత్రి పదవిని రానిస్తారా.. అనేది ప్రశ్న. ఆత్మీయ సమావేశం పేరుతో నిర్వహించిన కొల్లేరు ప్రజలకు ఇది చేస్తామని ఎంపీ అభ్యర్థి కారుమురి సునీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. ఎంతసేపు సమావేశంలో మీ బిడ్డను మంత్రిని చేస్తా అని చెప్పటం మినహా తామేం చేస్తామో అభ్యర్థులు చెప్పలేదు. ఎమ్మెల్యే జయమంగళ సైతం తన అప్పుల బాధలు, గతంలో తాను ఎదుర్కొన్న పరిస్థితులను చెప్పుకోవడం మినహా నా కొల్లేటి ప్రజలకు ఈ సమస్యను పరిష్కరిస్తారా అని అభ్యర్థులను సైతం ప్రశ్నించకుండా తనను వివక్షకు గురిచేశారని మాట్లాడడం హాస్యాస్పదంగా మారింది. ఓట్లు వేసి గెలిపించమని కోరడమే తప్ప కొల్లేరు ప్రజలకు చేసేది చెప్పకపోవడంతో వచ్చిన ప్రజలకు అసంతృప్తి మిగిల్చింది. గత ఐదేళ్లల్లో కొల్లేరు ప్రజలకు చేసిందేమీ లేదని రాబోయే రోజుల్లో కూడా ఏం చేస్తామో కూడా చెప్పకుండా సమావేశాన్ని ముగించేశారు. గతంలో జగన్మోహనరెడ్డి పాదయాత్రలో కొల్లేరుకు రెగ్యులేటర్ నిర్మిస్తామని హామీ ఇచ్చినప్పటికీ కనీసం దాని ఊసే లేదు. కనీసం కొల్లేరులో సంప్రదాయ వేట చేసుకునే అవకాశాన్ని కూడా కల్పించే హామీని ఇవ్వలేని నేతల మాటలను ఎలా నమ్మాలంటూ ప్రజలు గుసగుసలాడారు. తెలుగుదేశం ప్రభుత్వంలో మత్స్యకారులకు వలలు, సైకిళ్ళు, తాటిదోనెలు కొనుగోలు చేసుకు నేందుకు నిధులు మంజూరు చేశారని వైసీపీ ప్రభుత్వంలో అవి కూడా తమకు అందలేదని మరో ఐదేళ్లలో ఇలాంటివి అందజేస్తామనే హామీని కూడా ప్రకటించకపోవడం శోచనీయం. సభలో ఎవరు మాట్లాడినా కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌పై విమర్శలు తప్ప మరొకటి కన్పించలేదు. ఎమ్మెల్సీ పదవి వచ్చిన నాటి నుంచి కొల్లేరు ప్రజల సమస్యలను చట్టసభల్లో, ఇతర సమావేశాల్లో జయమంగళ ఎందుకు ప్రస్తావించలేదని కొల్లేరు ప్రజలకు అర్థం కాని ప్రశ్న. మీటింగ్ ఆద్యంతం ప్రతిపక్ష నాయకుడిపై విమర్శలు తప్ప మరొకటి లేదంటూ సమావేశానికి వచ్చిన కొల్లేరు ప్రజలు గగ్గోలు పెట్టారు.

కూటమిదే అధికారం

▸ నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథి ▸ భారీగా చేరికలు
▸ కైకలూరు వెలంపేటలో బీజేపీ, టీడీపీ నేతల ప్రచారం


వెంకటాయపాలెంలో సారథి సమక్షంలో టీడీపీలో చేరికలు


నూజివీడు టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి వెళుతున్న ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్


వెలంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

నూజివీడు, ఏప్రిల్ 3: కూటమి 160 సీట్లకు పైబడి గెలుస్తుందని నూజివీడు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమిపై అధికార పార్టీ నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారని వైఎస్సార్ కూడా అధికారంలోకి వచ్చినప్పుడు వామపక్షాలు, టీఆర్ఎస్‌లతో కలిసి పోటీచేశారన్న విషయం వైసీపీ నాయకులు మరువకూడదన్నారు. పురాణాల్లో రాక్షసులను ఎదుర్కొనేటప్పుడు మంచివారంతా ఒక తాటిపైకి వచ్చి పోరాడిన విషయం గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు నిబంధనల ప్రకారం 1వ తేదీ జీతాలు ఇవ్వాలని, దురదృష్టవశాత్తు ప్రతి నెలా 25, 26తేదీలకు కాని జీతాలు పడటం లేదన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రిటైర్మెంట్ సమయంలో ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను కూడా ఈ ప్రభుత్వం ఏళ్ల తరబడి నిలిపివేసిందన్నారు. మద్య నిషేధం తీసుకువస్తానని హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చాక మద్యంపై వచ్చే ఆదాయాన్ని 25 ఏళ్ల పాటు తాకట్టుపెట్టాడని, రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడం, ఆదాయం లేనివాటిపై ఖర్చుచేయటం ఆయనకు ఫ్యాషన్‌లా మారిందన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాలపై కేసులు బనాయించి వారిని వేధింపులకు గురిచేసిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. ఈ నేపథ్యంలో వ్యవస్థలను కాపాడాలని జనసేన, బీజేపీలతో టీడీపీ కూటమిగా ఏర్పడిందన్నారు. రాష్ట్రాన్ని విభజించే సమయంలో కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు చట్టరూపంలో కొన్ని హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయాలంటే కేంద్రంలో సహకారం అత్యవసరమన్నారు. అందుకే బీజేపీతో పొత్తు పెట్టుకుని పేదల కోసం ఆలోచించే నాయకుడు పవన్‌కల్యాణ్‌తో జత కలసి ముందుకు వెళుతున్నామన్నారు. జనసేన నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మాఫణిబాబు మాట్లాడుతూ ఐదుసంవత్సరాల పాటు ఏం చేశామో చెప్పుకోలేని వైసీపీ పెద్దలు అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. బీజేపీ నాయకుడు బోను అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వైసీపీ అరాచక పాలనను అంతమొందుతుందన్నారు.

ఆగిరిపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం పార్టీ ఆఫీస్ ప్రారంభించిన అనంతరం సాయంత్రం సూరవరం, కృష్ణవరం, కలటూరు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య, అధ్వాన రహదారులపై ఫిర్యాదులు రాగా టీడీపీ అధికారం చేపట్టగానే సమస్యలు తీర్చి మెరుగైన పాలన అందిస్తానన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్‌కు గ్యారెంటీ

కైకలూరు, ఏప్రిల్ 3: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని బీజేపీ నాయకుడు డాక్టర్ సీఎల్ వెంకట్రావు అన్నారు. బుధవారం కైకలూరు వెలంపేటలో, కరకట్ట ప్రాంతాల్లో టీడీపీ నేతలు వేర్వేరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ భవిష్యత్‌కు గ్యారెంటీ పత్రాలను చూపుతూ కూటమి అభ్యర్థులైన కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి అయిన పుట్టా మహేష్‌యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అలాగే ప్రజలకు చంద్రబాబు వస్తే అందే సంక్షేమ పథకాలను వివరించారు. ప్రస్తుతం వైసీపీ గత ఐదేళ్ళుగా రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని ప్రజలు విజ్ఞతతో ఓట్లు వేయాలని కోరారు. రౌడీయిజం, బెదిరింపులకు పాల్పడిన వారికి తగిన బుద్ధి చెప్పాలని నేతలు కోరారు. ఆయా ప్రచారాల్లో రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, మాజీ సర్పంచ్‌లు నర్సిపల్లి అప్పారావు, తెంటు నాగేశ్వరరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, టీడీపీ నాయకులు వేములపల్లి కారుణ్య, వేగిరెడ్డి సురేష్, కంచర్ల రామకృష్ణ, జనసేన నాయకులు మైగాపుల రామాంజనేయులు, టీడీపీ మండల తెలుగు మహిళా కార్యదర్శి శీలం కృష్ణవేణి, జనసేన మహిళలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

నూజివీడు టౌన్: నూజివీడు టీడీపీ కార్యాలయంలో పార్థసారథి సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. నూజివీడు మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన పల్లెపాం వంశీ, ఇందుపల్లి సన్ని తదితర 20 కుటుంబాలకు చెందిన వారు, ఆగిరిపల్లి మండలం నరసింగపాలెం ఎస్సీ కాలనీకి చెందిన పావులూరి శ్రీనివాసరావు, చింతకుంట ప్రకాష్ తదితర 30 కుటుంబాలు టీడీపీలో చేరారు. వైసీపీలో విద్య, ఉపాధి అవకాశాలు మృగ్యమయ్యాయని, చంద్రబాబు తిరిగి సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్న ఆశతో టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఎస్సీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రతాప్ ఏకపక్ష నిర్ణయాల వల్ల బీసీ, ఎస్సీల మధ్య గొడవలు జరుగుతున్నాయని, అనవసరమైన గొడవలు పెట్టి కేసుల్లో ఇరికిస్తున్నారని, అందుకే విసిగిపోయి టీడీపీలో చేరామని, పార్థసారథి విజయానికి కృషిచేస్తామని అన్నారు.

పార్థసారథి సతీమణి ప్రచారం


మాట్లాడుతున్న కొలుసు లక్ష్మీకమల

నూజివీడు టౌన్, ఏప్రిల్ 3: కొలుసు పార్థసారథి సతీమణి లక్ష్మీకమల బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నూజివీడు 2వ వార్డులో గల హనుమాన్‌నగర్‌లో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ అధ్యక్షతన వార్డు ప్రజలతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడుతూ టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలను, మహిళల పై పెరిగిన దాడులను ప్రజలకు వివరించాలన్నారు. తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలను తల్లికి వందనం, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి వాటిపై ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కందిపల్లి చెన్నారావు, గొల్లు దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.


నరసింగపాలెంలో టీడీపీలో చేరిన పలువురు

నూజివీడులో టీడీపీ కార్యాలయం ప్రారంభం


టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కొలుసు పార్థసారథి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 3: నూజివీడు నియోజకవర్గ నూతన కార్యాలయాన్ని బుధవారం నూజివీడు కూటమి ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి సతీసమేతంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలను నిర్వహించగా, కార్యక్రమానికి ఏలూరు పార్లమెంట్ టీడీపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూజివీడు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి పెద్దఎత్తున తెలుగుదేశంపార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొనడంతో కార్యాలయ ప్రాంగణం కోలాహలంగా మారింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి, ఏప్రిల్ 3 : మండలంలోని కోటపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఎక్కువ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నందున 4వ తేదీ ఉదయం 9 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు కోటపాడు సబ్‌స్టేషన్ పరిధిలో 3 ఫేజ్ కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సంజయ్ తెలిపారు. గృహాలకు మాత్రం సింగిల్ ఫేజ్ కరెంట్ పక్క సబ్‌స్టేషన్ నుంచి సరఫరా చేస్తామని రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మజ్జిగ వితరణ



నూజివీడు టౌన్, ఏప్రిల్ 3: వేసవిలో ప్రయాణికుల సౌకర్యార్థం నూజివీడు యువతరం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. నూజి వీడు బస్టాండ్ సెంటర్లోని యువతరం ఆటో యూనియన్ అధ్యక్షులు, ఉపాధ్య క్షులు ఎస్.రాజేష్, వై.సురేష్‌ల ఆధ్వర్యంలో బుధవారం వంద లీటర్ల మజ్జిగను పంపిణీ చేశారు. యూనియన్ కోశాధికారి పి.రమేష్, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



ముసునూరు, ఏప్రిల్ 3: మండలంలోని సింహాద్రిపురంలో నిర్మించిన నూతన ఆలయంలో పట్టాభి సీతారామయ్య, సీతమ్మ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ స్థల దాత పొట్లూరి వేణుగోపాల్ దంపతులు, పీఏసీఎస్ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వర రావు, పొట్లూరి వాసుదేవరావు, పొట్లూరి బుజ్జియ్య పొట్లూరి ప్రసాద్, పొట్లూరి మణేంద్రవర్మ దంపతులు విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనాన్ని కల్పించారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణాన్ని జరిపారు. ఆలయ కమిటీ భారీ అన్నసమారాధన నిర్వహించింది. భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం కల్యాణమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

మూడు గ్రామాల్లో ముద్దరబోయిన ప్రచారం



ముసునూరు, ఏప్రిల్ 3: మండలంలోని రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, సూరేపల్లి గ్రామాల్లో బుధవారం మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పాదయాత్రగా వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పదేళ్లుగా నియోజకవర్గంలో ఉన్నానని ఏ గ్రామంలో ఏ సమస్య ఉందో తెలుసని, తనను గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నారు.


వెంకటాపురంలో కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామాల్లో సాయుధ బలగాల కవాతు

కలిదిండి, ఏప్రిల్ 3 : ఎన్నికలు సమీపిస్తుండటం కలిదిండి మండలంలో కాళ్లపాలెం, వెంకటాపురం, కొండంగి గ్రామాల్లో బుధవారం సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా కైకలూరు సీఐ కృష్ణకుమార్ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకో వాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పౌరుల ఓటు హక్కుకు ఎవరైనా భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎస్ఐ ప్రియకుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్లలో అవగాహన

ఆగిరిపల్లి, ఏప్రిల్ 3: ఆగిరిపల్లి మండలం తోటపల్లి, చిన్నాగిరిపల్లి గ్రామాల్లో నూజివీడు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై సురేంద్రబాబు, పోలీస్ బెటాలియన్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎవరికీ భయపడకుండా సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవాలని, ప్రతి ఒక్కరూ ఓటు వేయడం బాధ్యత అని తెలిపారు.

ఎండకు అల్లాడిన జనం


తలపై ముసుగేసుకున్న కూలీలు

చాట్రాయి, ఏప్రిల్ 3: మండలంలో బుధవారం 39 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కావటంతో ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభం అయ్యి మధ్యాహ్నంకు వడగాల్పులు తోడయ్యాయి. ఎండ వడగాల్పులకు వృద్ధులు, పిల్లలు, రోగులు అవస్థలు పడ్డారు. మధ్యాహ్న సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. శీతల పానీయాలు, పండ్ల రసాలు, కొబ్బరి బొండాలకు గిరాకీ వచ్చింది. ఏప్రిల్ మొదట్లోనే ఎండలు ఇలా ఉంటే మే నెలలో ఇంకెలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి ప్రాంతంలో వేసవి తీవ్రత పెరిగింది. బుధవారం ఎండతోపాటు వడగాల్పులు కూడా వీచాయి. ఉదయం 11 గంటలకే ఎండ ప్రభావంతో ముదినేపల్లిలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. పలు రహదారుల్లో వాహనాల రాకపోకలను నిలిపేశారు. వాహనాలను చెట్ల కింద ఆపి డ్రైవర్లు, కూలికి వెళ్లి తిరిగి వస్తున్న వారు సేద తీర్చుకున్నారు. ముదినేపల్లి - వడాలి, సింగరాయిపాలెం, కోరుకొల్లు మార్గాల్లో పలు చోట్ల చెట్ల కింద నిలిపివేసిన వాహనాలు కనిపించాయి. చెట్ల కింద ఆపిన లోడు వాహనంపై కూడా పరదాలు కప్పుకుని కూలీలు పడుకోవటం కనిపించింది. ఎండ తీవ్రతకు ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వచ్చేందుకు భయపడ్డారు.

చెరువులకు స్వచ్ఛ నీరు చేరేనా?

చెత్తతో నిండిన ప్రధాన పంట కాల్వలు


పెయ్యేరు వద్ద పోల్‌రాజ్ కెనాల్‌లో దుర్వాసన వెదజల్లుతున్న వ్యర్థాలు..


ముదినేపల్లి వద్ద పోల్ రాజ్ కెనాల్‌లో పేరుకుపోయిన డెక్క, చెత్త

ముదినేపల్లి, ఏప్రిల్ 3 : తాగునీటి అవసరాలకు గ్రామాల్లోని మంచినీటి చెరువులకు స్వచ్ఛమైన నీరు చేరేలా కనిపించటం లేదు. ప్రధాన పంట కాల్వలతోపాటు బ్రాంచి కెనాల్స్‌లో పేరుకుపోయిన మేట వేసిన చెత్త కుప్పలను నేటికీ అధికారులు తొలగించలేదు. నీరు విడుదల చేసే నాటికి ప్రధాన, బ్రాంచి పంట కాల్వల్లోని గుర్రపు డెక్క, తూటుకాడలను, ఇతర చెత్త కుప్పలను తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇరిగేషన్ అధికారులలో చలనం లేదు. రెండు రోజుల క్రితం ఆర్డీవో ముదినేపల్లి ప్రాంతంలోని పంట కాల్వలను పరిశీలించి కాల్వలను పరిశుభ్రం చేయాలని ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు. తాగునీటి అవసరాలకు విడుదల చేసే నీరు మరో నాలుగు రోజుల్లో చేరుకోనుండగా, ముదినేపల్లి ప్రాంతంలోని పోల్ రాజ్, క్యాంప్ బెల్ ప్రధాన కాల్వలతోపాటు చాలా బ్రాంచి కాల్వల్లో పలు చోట్ల గుర్రపు డెక్క పేరుకుపోగా, కాల్వలన్నీ చెత్త, ఇతర వ్యర్థాలతో నిండిపోయాయి. ఆ వ్యర్థాలు కలసిన నీటినే పంచాయతీల మంచినీటి చెరువులకు తోడే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే కలుషితమైన చెరువులో కాల్వల ద్వారా వెళ్లే అపరిశుభ్ర నీరు తోడితే మరింత కలుషితమయ్యే అవకాశాలున్నాయి.


ఉప్పుటేరుపై ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్డు

ఆదమరిస్తే అంతే...

కలిదిండి, ఏప్రిల్ 3 : మద్వానిగూడెం వద్ద ఉప్పుటేరుపై ఉన్న వంతెన అప్రోచ్ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. దీంతో రాత్రి పూట వాహనాలు అదుపు తప్పి బోల్తా పడి వాహనదారులు గాయాల పాలవుతున్నారు. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు పక్కకు తప్పుకోవటానికి వీలు లేక ట్రాఫిక్ స్తంభిస్తోంది. నిత్యం ఈ వంతెన రద్దీగా ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వంతెన వద్ద కోతకు గురైన అప్రోచ్ రోడ్డు రైలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు రాష్ట్ర స్థాయి అండర్-17 చదరంగం పోటీల క్రీడాకారుల ఎంపిక

భీమవరం అర్బన్, ఏప్రిల్ 3: పశ్చిమ గోదావరి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలోఈ నెల 5న భీమవరం అనసూయ చెస్ అకాడమీలో జిల్లా స్థాయి అండర్ 17 బాయ్స్, గరల్స్ చదరంగ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనేవారు 1-1-2007వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలని, పోటీల్లో గెలుపొందిన వారు ఈనెల 20, 21 తేదీల్లో గుడివాడలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-17 పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.వివరాలకు 90632 24466 నంబర్‌లో సంప్రదించాలన్నారు.